# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, ఏప్రిల్ 29, 2026 | సంపుటి - 20 | సంచిక 223 | వెల - 4రూ | పేజీలు - 12

Circulated by Vijayawada, AlluriSeetharamaraju, Vizianagaram,Parvathipuram, Srikakulam, Kakinada,East Godavari,Konaseema, West Godavari, Krishna,Guntur, Bapatla,NTR,Anantapuram, Satyasai Kurnool,Nandyala, Chittoor,Tirupati,Annamayya, Telangana State


## రాష్ట్రంలో సమృద్ధిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు

### అనవసర భయాందోళనలకు గురి కావద్దు

### పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



హైదరాబాద్ : రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా సమృద్ధిగా ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 27 వ తేదీన డిమాండ్ ను మించి పెట్రోల్ , డీజిల్ లను 29,939 కిలో లీటర్లు సరఫరా చేసినట్లు వివరించారు. సగటున రోజుకు 5,883 కిలో లీటర్లు పెట్రోల్, 7,348 కిలో లీటర్లు డీజిల్ కు డిమాండ్ ఉండేదని ఆయన తెలిపారు. కానీ 27 వ తేదీన 11,490 కిలో లీటర్లు పెట్రోల్, 18,449 కిలో లీటర్లు డీజిల్‌ను వాహనదారులకు సరఫరా చేసినట్లు తెలిపారు.

తరువాయి 2లో



## వివాదంలో అషురెడ్డి వ్యవహారం

- పెళ్లిపేరుతో ధర్మేంద్ర నుంచి రూ. 9.83 కోట్లు వసూళ్లు
- ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు
- హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన అషురెడ్డి




## గూగుల్.. ఎపికి గేమ్ ఛేంజర్

- దేశానికి ఎపి డేటా గేట్‌వేగా నిలుస్తుంది
- గ్రోత్ ఇంజిన్‌గా మారనున్న గూగుల్
- 2028 నాటికి గూగుల్ సెంటర్ పూర్తి
- ఎంఓయూలతోనే కాదు..వాటిని ముందుకు తీసుకెళ్తున్నాం
- గూగుల్ సెంటర్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

విశాఖపట్నం : గూగుల్ రాక.. విశాఖకే కాదు.. ఏపీకి ఒక గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీ చరిత్రలో మరచిపోలేని రోజు ఇదన్నారు. భారతదేశానికి ఏపీ..అంతర్జాతీయ డేటా గేట్‌వేగా నిలుస్తుంది. విశాఖలోని తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, గూగుల్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్.. ఏపీ టెక్నాలజీతోపాటు దేశానికే గ్రోత్ ఇంజిన్‌గా మారు తుందన్నారు. టెక్నాలజీ హబ్‌కు భవిష్యత్‌లో తుర్లవాడ పేరు మార్మోగుతుందన్నారు. టెక్నాలజీలో ఏపీ సగర్వంగా తలెత్తుకొని నిలబడుతుంది.

తరువాయి 2లో

### అమరావతి - హైదరాబాద్ మధ్య

## బుల్లెట్ ట్రైన్

- 70 నిముషాల్లోనే ప్రయాణం
- చంద్రబాబు విజనరీ లీడర్
- కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



విశాఖపట్నం : చంద్రబాబు నేతృత్వంలో విశాఖపట్నం త్వరలోనే ఐటీపట్నం కాబోతోందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య 70 నిమిషాల్లో, చెన్నై నుంచి అమరావతికి 112 నిమిషాల్లో ప్రయాణం సాధ్యమవుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల 08 నిమిషాల్లో ప్రయాణం చేయవచ్చన్నారు.

తరువాయి 2లో




### మహిళా సర్పంచ్‌ల ఫోరం

## రాష్ట్ర కన్వీనర్‌గా గుంటిపల్లి రేణుక

రాష్ట్ర మహిళా సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ గా శ్రీమతి గుంటిపల్లి రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లోని సెక్రటేరియట్ ఆవరణలో జరిగిన మహిళా సర్పంచ్ ల సమావేశంలో మహిళా సర్పంచ్ లందరూ కలిసి రేణుకను కన్వీనర్‌గా ఎన్ను కున్నారు. ఎంబిసీ, సంచార జాతుల సామాజిక నేపథ్యం గల గుంటిపల్లి రేణుక ఇటీవల జరిగిన గ్రామ పంచా యతీ ఎన్నికల్లో హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామం నుండి భారీ మేజార్టీతో ఎన్నికయ్యారు. ఈ సారి తెలంగాణ పంచాయతీల్లో దాదాపు 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకే దక్కాయి.

2లో

## ఫ్యూచర్ కోసమే... సిటీ నిర్మాణం



- ప్రపంచ దేశాలకు ధీటుగా నగర ప్రణాళిక
- 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం
- ఓఆర్ఆర్ పెద్ద అసెట్ కానుంది
- ప్రజాప్రతినిధులు సిటీ కోసం కృషి చేయాలి
- మూడు బుల్లెట్ ట్రైన్స్ కేంద్రంగా శంషాబాద్

### ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నిర్మాణానికి సిఎం రేవంత్ శంకుస్థాపన



హైదరాబాద్ : ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరి కృషితోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ సిటీ నిర్మాణం అంత సులభం కాదన్నారు. అయితే పక్కా ప్రణాళికతో ప్రపంచ నగరాలకు దీటుగా నిర్మించ బోతున్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే నగరంలో తమనూ కలపాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు.

2




2

### నేడు టెన్త్ ఫలితాలు

## విడుదల

హైదరాబాద్,ఏప్రిల్ 28 : తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది.



### తెలంగాణలో పెరిగిన

## ఎండల తీవ్రత

- ఇప్పటికే వడదెబ్బకు ముగ్గురు మృతి
- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హీట్‌వేవ్
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు రావడం కష్టంగా మారింది.

2లో

## కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి భేటీ



2

### రాష్ట్రానికి రావాల్సిన సాయం తదితర అంశాల ప్రస్తావన

హైదరాబాద్ : కేంద్రమంత్రి రాజీవ్‌రంగన్ సింగ్‌తో వాకిటి శ్రీహరి భేటీ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన సాయం తదితర అంశాలను ప్రస్తావించారు. రాజేంద్ర నగర్ లోని జాతీయ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్యాల యంలో కేంద్ర పశుసంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి మత్స్య శాఖ



### శబరిమలలో మహిళల

## ప్రవేశంపై విచారణ

- రాజ్యాంగపరమైన ప్రశ్నలపైనే మాదృష్టి
- ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదు
- సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశం, ఇతర మతపరమైన ఆచారాలపై దాఖలైన రివ్యూ పిటిషన్లపై సుప్రీంకోర్టులో వాదనలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల భారీ రాజ్యాంగ ధర్మాసనం ఈ విచారణను చేపట్టింది. ఈ సందర్భంగా రాజ్యాంగ నైతికత, మతపంˆమైన విశ్వాసాల మధ్య జరుగు తున్న చర్చ దేశవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు ధర్మాసనం ఒక కీలకమైన అంశాన్ని స్పష్టం చేసింది. తాము కేవలం రాజ్యాంగ పరమైన ప్రశ్నలపై మాత్రమే దృష్టి పెడుతున్నామని

2లో

## ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం



- ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలను తిప్పికొట్టాలి
- షాంఘై సహకార రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ : ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు.

తరువాయి 2లో



### సిక్కిం ఆవిర్భావ

## దినోత్సవం

- పిల్లలతో కలసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని

న్యూఢిల్లీ : నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి.

తరువాయి 2లో

## మహిళా సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా గుంటిపల్లి రేణుక

రాష్ట్రంలో మొత్తం 12,703 గ్రామాల్లో 6403 మంది మహిళా సర్పంచ్ లే ఉన్నారు. గ్రామ పంచాయతీల్లోని సమస్యలు, ముఖ్యంగా గ్రామాల్లోని మహిళలపై, మహిళా సర్పంచ్ ల ప్రాధాన్యాలపై మహిళా సర్పంచ్ ల ఫోరం పనిచేస్తుంది. మండల, జిల్లా కమిటీల ఎన్నిక అనంతరం హైదరాబాద్ లో రాష్ట్ర మహిళా సర్పంచ్ ల ఫోరం పూర్తి స్థాయి కమిటీని ఎన్నిక ఉంటుంది. ఈ లోగా మహిళా సర్పంచ్ ల ఫోరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేస్తుంది. పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీ ప్రకటన వరకు రేణుక కన్వీనర్ గా వ్యవహరిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి మహిళా సర్పంచ్ లను ఏకం చేసి జిల్లా కమిటీలను, రాష్ట్ర కమిటిని అధికారికంగా నియమిస్తామని, ఇదే క్రమంలో సమస్యలపై చర్చించి పోరాటం చేస్తామని ఈ సందర్భంగా గుంటిపల్లి రేణుక చెప్పారు. గ్రామ పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు నేరుగా నిధులు విడుదల చేయాలని, గ్రామాల్లో మహిళా సర్పంచ్ ల సాధికారిత కోసం ప్రభుత్వం చొరవ తీసుకునే విధంగా, మహిళా సర్పంచ్ ల వేతనం పెంచేవిధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. నిత్యం గ్రామాల్లోనే ప్రజల మధ్య ఉంటూ ఇంటివద్దే ఊరిని చక్కదిద్దే బాధ్యతలు కలిగిన మహిళా సర్పంచ్ ల సమస్యలపై మరింత అధ్యయనం చేస్తున్నామని చెప్పారు.

## తెలంగాణలో పెరిగిన ఎండల తీవ్రత

తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత కారణంగా తెలంగాణలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. వడదెబ్బతో ముగ్గురు మృతి చెందగా, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకపోతే దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ కొనసాగుతున్నది. ఎండలు దంచికొడుతున్నాయి. చాలా చోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి, కొన్ని చోట్ల వరుసగా గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటుతోంది. అయితే అదే స్థాయిలో విద్యుత్తు వినియోగం కూడా జరుగుతున్నది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తును వినియోగించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఎయిర్ కండీషనర్లు, డిజర్ట్ కూలర్ల అధికంగా వాడడం వల్ల విద్యుత్తు వినియోగం కూడా పీక్ స్థాయికి చేరుకున్నది. విద్యుత్తు శాఖ డేటా ప్రకారం సోమవారం సుమారు 256 గిగా వాట్ల విద్యుత్తు వినియోగం జరిగినట్లు తెలిసింది. ఈనెలలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఈ నెల రెండో అర్థభాగం నుంచి విద్యుత్తు మోత మోగుతున్నది. శుక్రవారం రోజు 252.07 గిగావాట్లు, శనివారం ఏప్రిల్ 25వ తేదీన 256.11 గిగావాట్ల వినియోగం జరిగినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. అయితే గత ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గింది. ఆదివారం 238.15 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. కమర్షియల్, ఇండస్ట్రియల్ కంపెనీలు ఎక్కువగా సెలవు తీసుకోవడం వల్ల ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గినట్లు అంచనా వేశారు. దీంతో పాటు కొన్ని చోట్ల డస్ట్ స్టార్మ్, వర్షాలు పడడం వల్ల ఆదివారం వినియోగం తగ్గింది. గత ఏడాది అత్యధికంగా విద్యుత్తు వినియోగం జూన్‌లో రికార్డు అయ్యింది. 2025 జూన్‌లో ఓ రోజు గరిష్టంగా సుమారు 242.77 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. 2024లో గరిష్టంగా 250గిగావాట్ల విద్యుత్తును మే నెలలో వాడారు. ఇక 2023లో సెప్టెంబర్‌లో సుమారు 243.27 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండనున్నట్లు ఐఎండీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది గరిష్టంగా 270 గిగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ నిపుణులు చెబుతున్నారు.

## సిక్కిం ఆవిర్భావ దినోత్సవం

మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉదయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఆటకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'గ్యాంగ్‌టక్‌లో యువ మిత్రులతో కలిసి ఆడటం చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాని స్పోర్ట్స్ దుస్తుల్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిక్కిం 50వ రాష్ట్ర అవిర్భావ దినోత్సవ ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరై. రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఆ ప్రాంత భారత యూనియన్‌లో చేరి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు. అధికారిక కార్యక్రమాలకు ముందు గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు, వీడియోలను ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో అవి వేగంగా వైరల్ అయ్యాయి. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. 'గ్యాంగ్‌టక్‌లో ఉదయం యువ స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడడం చాలా ఎనర్జీ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. కాగా, సిక్కింలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. సిక్కింలో రహదారుల కనెక్టివిటీ, ఆరోగ్యం, టూరిజం, విద్య, నగర అభివృద్ధి సహా వివిధ రంగాల్లో రూ.4,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు.

## అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్

చెన్నై నుంచి కోల్‌కతా మధ్య రైల్వే లైన్లను 4 లేన్లుగా విస్తరించే పనులు చేపడతామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు సైబరాబాద్ నిర్మించారని.. ఐటీ అభివృద్ధిలో సైబర్ టవర్‌ది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు విజన్కు సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఆయనను దేశం గర్వించే విజనరీ లీడర్‌గా కేంద్రమంత్రి అభివర్ణించారు. యువనేత లోకేశ్ ఎనర్జీ, నాయకత్వం అద్భుతమని కొనియాడారు. సమస్యల పరిష్కారంలో యువనేతలకు లోకేశ్ ఆదర్శమని పేర్కొన్నారు. తయారీ రంగంలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని, భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ తయారీ అత్యంత కీలకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. 2024 నుంచి సెమీకండక్టర్ల తయారీపై కేంద్రం దృష్టి సారించిందని తెలిపారు. గూగుల్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖపట్నానికి రావడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జూన్ 1 నుంచి విశాఖపట్నం రైల్వే జోన్‌ను నోటిఫై చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

హైదరాబాద్,ఏప్రిల్28 : డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళవారం బంగారం ధర తగ్గినట్లు నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గదల నమోదు చేసింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,250గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.650 మేర తగ్గింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,150గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,400గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు 4 వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా, బెంగళూరులో రూ.2.60 లక్షలుగా ఉంది.

# ఫ్యూచర్ కోసమే... సిటీ నిర్మాణం

ప్రజల్ని అభివృద్ధిలో భాగస్వాములు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన చేశారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికీ సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో చాలా మంది నేతలు హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని చెప్పారు. ఇప్పుడు నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లోని అత్యాధునిక నగరాల తరహాలో, భారత్‌లోనే నాలుగో నగరంగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. మనకున్న అద్భుతమైన ఆర్ఆర్ఆర్, ఐటీ ఎగుమతులు, కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో మన ఘనతలే ఈ నగరానికి స్ఫూర్తి అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ నగర నిర్మాణానికి సహకరించే వారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. వచ్చే జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సిటీ నిర్మాణానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని.. ప్రపంచంతో పోటీపడేలా నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే అవహేళన చేశారని.. ఏ నగరానికీ లేని ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు ఉందన్నారు. మూడు కొవిడ్ వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అయ్యాయని గుర్తు చేశారు. యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లూ హైదరాబాద్‌లో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడేటా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం ఒక నగరం కాదు, ఇది రాబోయే తరాల తలరాతను మార్చే అద్భుతమన్నారు. ఈ నగర నిర్మాణం అంత సులభం కాదు. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఫ్యూచర్ సిటీలో కలవాలనుకునే గ్రామాలు... గ్రామ సభల్లో తీర్మానం చేసి ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకోవాలి. తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి.. కలెక్టర్, మంత్రికి పంపాలి. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతాం. ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం అని సీఎం అన్నారు. ఇకపోతే కేంద్రం దేశవ్యాప్తంగా ఏడు బులెట్ ట్రైన్లను ప్రకటిస్తే.. అందులో మూడు మన రాష్ట్రానికే రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శంషాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, అమరావతి నగరాలను అనుసంధానిస్తూ బులెట్ రైళ్లు పరుగులు తీయబోతున్నాయని చెప్పారు. కేవలం రైళ్లే కాదు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీ బస్సు టెర్మినల్‌ను కూడా మనం నిర్మించుకోబోతున్నామని రేవంత్ తెలిపారు. మెట్రో, బులెట్ ట్రైన్, అత్యాధునిక బస్ టెర్మినల్.. ఇవన్నీ ఒకే చోట ఏర్పాటు కాబోతున్నాయన్నారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యం కాబోతోందని చెప్పారు. తాను కూడా ఈ గడ్డ నుండే ఊరికి వెళ్తాను.. అందుకే మీపై ఉన్న అభిమానంతో, ఈ ప్రాంత భవిష్యత్తు కోసం అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ లేనివాడు ఫ్యూచర్ సిటీ అంటున్నాడని కొందరు అంటున్నారు... నా మీద ఏడ్చే వారికి నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఏడ్చుకుంటూనే ఉండండి, నేను నా పని చేసుకుంటూనే పోతా.. మీ ఏడుపే నా చెవులకు వినిపించే మధుర సంగీతం అని రేవంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు మహేందర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, డిజిపి శిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూగుల్.. ఎపికి గేమ్ ఛేంజర్

కొత్త ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ స్వాగతం పలుకుతుంది. ఏఐ డేటా సెంటర్ ఒక గిగావాట్ సామర్థ్యంతో పని చేస్తుంది. సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్.. ఇప్పుడు భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మారబోతోంది. ప్రముఖ సంస్థలు విశాఖలో పెట్టుబడులకు రావడం శుభపరిణామం. గూగుల్ ఆవిష్కరణలు.. ఏపీ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రెండూ కలుస్తున్నాయి. ఓడరేవుల వంటి రంగాల్లో పని చేస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థ అదానీ.. ప్రజలకు కమ్యూనికేషన్‌తో అనుసంధానం చేస్తున్న మరో సంస్థ ఎయిర్‌టెల్.. ఈ మూడు సంస్థలు ఎప్పుడూ నూతన ఆలోచనలు చేస్తుంటాయన్నారు. 2028 సెప్టెంబర్ నాటికి గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణం పూర్తి కావాలి. రెండు, మూడు నెలలు ముందుగానే పూర్తి చేసేందుకు సహకరిస్తాం. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేస్తాం. భవిష్యత్‌లో అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా మారుతుంది. వ్యాపార నిర్వహణ ఖర్చు.. మిగిలిన నగరాలకంటే చాలా తక్కువగా ఉంటుంది. జూన్ 1న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభమవుతుందని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఎంవోయూలకే పరిమితం కాదు.. ముందుకు ఎలా తీసుకెళ్లాలో చూపిస్తున్నాం. పెట్టుబడులు, ఒప్పందాలే కాదు.. ప్రారంభంలోనూ ముందున్నాం అని చంద్రబాబు అన్నారు. అలాగే విశాఖకు గూగుల్ రాక ఉత్తరాంధ్రకే గర్వకారణమని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటవుతోందని తెలిపారు. విశాఖను గూగుల్ ఎంపిక చేసుకోవడం ఏపీకి గర్వకారణమని వ్యాఖ్యానించారు. గూగుల్, ఎయిర్‌టెల్ రెండూ కీలక సంస్థలని వెల్లడించారు. సెప్టెంబర్ 2028 నాటికి గూగుల్ డేటా సెంటర్ పూర్తవుతుందని స్పష్టం చేశారు. అతి త్వరలో అన్నిరంగాల్లో ఏఐ సేవలు వస్తాయని వివరించారు. 60 రోజుల్లో అనకాపల్లి, విశాఖపట్నానికి గోదావరి నీళ్లు వస్తాయని చెప్పుకొచ్చారు. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖకు అద్భుతమైన కనెక్టివిటీ ఉందని తెలిపారు. 2028 చివరినాటికి ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ తొలిదశ పూర్తి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏఐ సిటీగా విశాఖ ఉంటుందని.. తెలిపారు. టెక్నాలజీలో దేశానికే గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ ఉందని వెల్లడించారు. పెట్టుబడిదారులే ఏపీకి భాగస్వాములని చెప్పారు. ఒప్పందాలే కాదని.. గ్రౌండింగ్ కూడా తమదే బాధ్యత అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## వివాదంలో అషురెడ్డి వ్యవహారం

హైదరాబాద్బ్ : బిగ్ బాస్ ఫేమ్, ప్రముఖ సినీనటి అషురెడ్డి చుట్టూ వివాదాలు ముదురుతున్నాయి. పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుడు ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఈ కేసులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి. అషురెడ్డి, ధర్మేంద్ర వివాహం చేసుకోవాలని అనుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి వద్దకు వెళ్లి ఇరు కుటుంబాలు జాతకాలు కూడా చూపించాయని ప్రచారం జరుగుతోంది. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్ని సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు సమాచారం. అషురెడ్డి తనను మానసికంగా, ఆర్థికంగా వేధించిందని బాధితుడు ధర్మేంద్ర పేర్కొన్నారు. అషురెడ్డి అవసరాల కోసం తాను పలు బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకుని మరీ ఖర్చు చేశానని తెలిపారు. ఇప్పుడు ఆ లోన్‌లు తీర్చలేక ఇబ్బంది పడుతున్నానని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే, తనపై తిరిగి కేసు పెడతానని లేదా ఆత్మహత్య చేసుకుంటానని అషురెడ్డి బెదిరిస్తోందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. తన బాయ్‌ఫ్రెండ్ జయంత్‌తో కలిసి అషురెడ్డి ఈ డ్రామా ఆడిందని, తనను మోసం చేసిందని బాధితుడు వాపోతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అషురెడ్డి కుటుంబంపై పోలీసులు కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరానికి పాల్పడటం వంటి సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. అయితే తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ తీసుకోకుండానే పోలీసులు ఏకపక్షంగా కేసు నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ కేసును వెంటనే కొట్టివేయాలని ఆమె కోర్టును వేడుకున్నారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది. రెండు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, ఇప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అషురెడ్డి పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## శబరిమలలో మహిళల ప్రవేశంపై విచారణ

వ్యక్తిగత ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదని కోర్టు తెలిపింది. నిర్దిష్టమైన ఆలయ సంప్రదాయాల కంటే, మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కుల పరిధినే తాము సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది. వాదనల సమయంలో ఒక మహిళా న్యాయవాది అస్సాంలోని కామాఖ్య ఆలయ ఉదాహరణను కోర్టు ముందు ఉంచారు. అక్కడ మహిళల రుతుస్రావాన్ని ఒక వేడుకగా జరుపుకొంటారని ఆమె వివరించారు. అదే సమయంలో, అక్కడ జరిగే జంతు బలులను ఆపాలని ఒక పిటిషనర్ కోరగా.. ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ ప్రస్తావనను తోసిపుచ్చింది. సీనియర్ అడ్వకేట్ శ్రీధర్ పోతరాజు ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. 'మతపరమైన విశ్వాసాలను పరీక్షించేటప్పుడు నాస్తికుల అభిప్రాయాలను కోర్టు పరిగణనలోకి తీసుకోకూడదు' అని ఆయన వాదించారు. మతపరమైన హక్కులు కేవలం భక్తుల కోణం నుంచే చూడాలని, ఆచారాల పట్ల నమ్మకం లేని వారి వాదనలకు ఇక్కడ తావు లేదని ఆయన కోర్టుకు విన్నవించారు. ఆధ్యాత్మిక స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్-21 (జీవించే హక్కు)లో అంతర్భాగమని శ్రీధర్ పోతరాజు వాదించారు. మతపరమైన ఆచారాల్లో న్యాయస్థానాల జోక్యానికి ఖచ్చితమైన పరిమితులు ఉండాలని న్యాయవాదులు కోరారు. వ్యక్తిగత విశ్వాసాలకు, రాజ్యాంగ నైతికతకు మధ్య ఉన్న సమతుల్యతపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.

## కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి భేటీ

మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిల, పశు సంవర్ధక శాఖ అధికారి లక్ష్మీ నారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు. పశు సంవర్ధక, పాడి, మత్స్య శాఖల్లో తెలంగాణ అమలు చేస్తున్న పథకాలను కేంద్రమంత్రికి మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. కేంద్రం నుంచి తెలంగాణకు సహకారం ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను శాలువా, పూల బోకే, మెమోటెంతో ఘనంగా సన్మానించిన మంత్రి వాకిటి శ్రీహరి రాష్ట్రానికి కేంద్రం నుంచి కావలసిన సహకారం, ఆక్వా కల్చర్, లైఫ్ సైన్సెస్ లో ఇన్సూరెన్స్, మోపెడ్ కేటాయింపుల్లో న్యాయం వంటి పలు అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉన్న 46 వేల పెద్ద చెరువులు, 26 వేల చిన్న చెరువులు, 100 రిజర్వాయర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే నిధులను తీసుకు రావడంలో విఫల మయింది.రాజేంద్ర నగర్ లో ఉన్న ఎన్ఎఫ్‌డిసిని తరలించమని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. తరలింపుపై వస్తున్న ప్రచారంపై కేంద్రమంతి రాజీవ్ రంజన్ దృష్టికి మంత్రి వాకిటి శ్రీహరి తీసుకుపోయారు. దీనిని తరలించే ఆలోచన లేదని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు.

## మిషన్ భగీరథ కార్మికులకు వేతన బకాయిలు

### ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపణ

మెదక్,ఏప్రిల్28 : మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులకు గత 6 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం సరైనది కాదని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. మంగళవారం చిలిపిచేడ్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనం ఇవ్వడం లేదని.. ఇచ్చే వేతనం కూడా 6 నెలలుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని తెలిపారు. కార్మికుల పనిగంటలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వారు తెలిపారు. 4 కొత్త లేబర్ చట్టాల అమలు కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెట్టడమే అవుతుందని అన్నారు. బ్రిటిష్ కాలం నుంచే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మికచట్టాలను తొలగించడం సిగ్గు చేటు అని విమర్శించారు. దేశం మొత్తం కరోనాతో అతలాకుతలమవుతున్న సమయంలో (2019, 2020)లో నాలుగు కొత్త లేబర్ చట్టాలను తీసుకురావడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో సంపన్నులు పెరిగారని.. నిరంతరం కష్టపడుతున్న కార్మికులు మాత్రం రోడ్డున పడే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దేశవ్యాప్తంగా మే 1 నుంచి 7వ తేదీ వరకు మేడే వార్షికోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం

ఉగ్రవాదం పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత ఏడాది జమ్ముకశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. పవాల్గామ్ ఉగ్రదాడి ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆ దాడి అనంతరం 'ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందని తెలిపారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రదాడులను అస్సలు విస్మరించకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్నారు. ఉగ్రవాదులకు సాయపడుతూ ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీవో వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం గురించి కూడా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందని చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ క్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

## రాష్ట్రంలో సమృద్ధిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు

సరఫరాను క్షేత్ర స్థాయి అధికారులు, పెట్రోల్ కంపెనీల ప్రతినిధులతో రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అపోహలతో పెట్రోల్, డీజిల్ ను నిల్వచేసుకోవద్దని వినియోగదారులకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ సూచించారు.

## నేడు టెన్త్ ఫలితాలు విడుదల

ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. మార్చి 14 నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ఈ నెల 13న పూర్తయ్యాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయింది. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ముందు నుంచి చెబుతున్నా... తాజాగా ఈనెల 29న విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది.

## సిసి కెమరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు

### అలాంటి పోలీస్ అధికారులను వదలం

### మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక

సంగారెడ్డి,ఏప్రిల్ 28 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ మూర్ఖత్వం.. హిట్లర్‌ను మించిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌పై దాడి కేసులో జైల్లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొంత మంది ఐపీఎస్‌లు తమ ఫోన్‌లను.. ఇంటి ముందున్న సిసి కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. బెంగళూరు నుంచి హ్యాకర్లను తీసుకొచ్చి తమపై నిఘా పెడుతున్నారన్నారు. 'అలాంటి అధికారులు జాగ్రత్త.. మీరు రిటైర్డ్ అయినా మిమ్మల్ని వదలం' అని హెచ్చరించారు. మన్నే క్రిశాంక్‌తో పాటు ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. రైతులు, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఎవరు మాట్లాడితే వాళ్లపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై అక్రమ పోస్టులు పెడుతున్నారని పోలీసులకు క్రిశాంక్ ఫిర్యాదు చేశారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లపై కేసులు పెట్టాల్సింది పోయి ఫిర్యాదు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు పెట్టారని మండిపడ్డారు. నాన్ బెయిలబుల్ కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. బెయిల్ ఇవ్వాల్సిన కేసును పాత కేసులు చూపెట్టి జైల్లో వేశారని ఆరోపించారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తే కేసు పెడతారా అని మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీశారు.

# ఆంధ్రప్రదేశ్

## చిత్తూరు జిల్లా వి.కోటలో దారుణం

### ఎబిఎన్ జర్నలిస్టును హత్య చేసిన రౌడీ షీటర్

### దర్యాప్తు చేపట్టిన పోలీసులు

చిత్తూరు,ఏప్రిల్28 : వి.కోటలో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. మంగళవారం ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి జగన్‌ను కత్తులతో నరికి చంపేశారు. ఆపై అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. హత్యకు పాల్పడింది రౌడీ షీటర్ తమీమ్‌గా గుర్తించారు. తమీమ్‌కు మరో వ్యక్తి సాయపడినట్టు పోలీసులు వెల్లడించారు. తమీమ్‌ది వి.కోట అయినప్పటికీ ప్రస్తుతం కర్ణాటకలో నివాసం ఉంటున్నాడు. మృతుడు జగన్మోహన్ రెడ్డి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి హత్యను జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ప్రజాస్వామ్యంలో ఇటువంటి సంఘటనలు సిగ్గుచేటని ఆంధప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం తిరుపతి జిల్లా సభ్యుడు అరవ గోపాల్ అన్నారు. ఏదైనా సమస్య ఉంటే చర్చించి పరిష్కరించుకోవాల్సిన మార్గాలు చాలా ఉన్నాయని... అలా కాదని దుర్మార్గమైన, దురహంకారమైన ఆలోచనలతో తోటి మనిషిని చంపడం బాధాకరమన్నారు. ఇలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తోటి విలేకరి చనిపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ 'ఆంధప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం' తరఫున అరవ గోపాల్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ÷త్తూరు జిల్లా ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్యను ఆంధప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చెంగల్రాయులు (గాంధీ), వళిగళం గోపిలు తీవ్రంగా ఖండించారు. హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్య వెనకున్నది ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని హత్య వెనుకున్న అసలు నిందితులను అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫెడరేషన్ జర్నలిస్టుల ఆందోళనకు ఆ సంఘం అధ్యక్షులు జి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఒక సామాన్య జర్నలిస్టును అతికిరాతంగా చంపడం దారుణమని అన్నారు. చిత్తూరు జిల్లా పోలీసులు వెంటనే హత్య వెనుక దాగి ఉన్న కుట్రను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి హత్యను జర్నలిస్ట్ సంఘాలు జీర్ణించుకోలేకపోతున్నాయని చెంగల్రాయులు, వళిగళం గోపి ఆవేదన వ్యక్తం చేశారు.

## కాలేజీ కోసం ప్రభుత్వం రోడ్డు

### హైకోర్టు ఆగ్రహం..సిఐడి విచారణకు ఆదేశం

అమరావతి,ఏప్రిల్28 : కడప జిల్లా ప్రొద్దుటూరులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ ప్రైవేట్ కాలేజీ కోసం.. లే అవుట్‌లో ప్రభుత్వ నిధులతో రహదారి వేశారు. దీనిపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారంటూ.. సీఐడీ విచారణకు హైకోర్టు ఆదేశించింది. ఈ అంశంపై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ఏపీ హైకోర్టు పైవిధంగా స్పందించింది. తమ అనుమతి లేకుండా రహదారి వేశారంటూ లే అవుట్‌లోని పలువురు భూ యజమానులు హైకోర్టును గతంలో ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపి నివేదిక అందించాలంటూ జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. రహదారి వేసే సమయంలో ఎవరూ అభ్యంతరం చెప్పలేదని.. కానీ ప్రైవేట్ భూముల్లో భూ సేకరణ చేయకుండానే ఈ రోడ్డు వేశారంటూ కోర్టుకు జిల్లా కలెక్టర్ నివేదిక అందజేశారు. రోడ్డు నిర్మాణం వల్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని కోర్టు స్పష్టం చేసింది. దీనికి ఆ సమయంలో ఉన్న అధికారులు, కౌన్సిల్ చైర్మన్‌తో పాటు సభ్యులు కారణమయ్యారని స్పష్టం చేసింది. ప్రభుత్వ ధనం దుర్వినియోగం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై సీఐడీ విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ లే అవుట్‌లో రహదారి నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది.

## నేడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ వివాహం

### బంధువుల సమక్షంలో తిరుమలలో పెళ్లిబాజాలు

తిరుపతి,ఏప్రిల్28 : టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఒక ఇంటివాడు కాబోతున్నాడు. కావ్య అనే యువతితో కలిసి ఆయన వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టనున్నాడు. వీరికి పెళ్లికి సంబంధించిన ముహూర్తం ఖరారైంది. 29వ తేదీ బుధవారం రాత్రి 11:13 గంటలకు తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవారి సాక్షిగా అత్యంత వైభవంగా వీరి వివాహ వేడుక జరగబోతున్నట్లు సమాచారం. సంప్రదాయబద్ధంగా సాగే ఈ వైదిక వేడుక కోసం వధూవరులిద్దరూ ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ శ్రవణ్ కుమార్ ప్రత్యేకంగా రూపొందించిన వస్త్రాలను ధరించబోతున్నారు. తిరుమలలో కేవలం కుటుంబ సభ్యులు మరియు అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ పెళ్లి వేడుక జరగనుంది. అనంతరం మే నెలలో హైదరాబాద్‌లో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు ,బంధుమిత్రుల కోసం భారీ ఎత్తున రిసెప్షన్ నిర్వహించబోతున్నారు

## శ్రీవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

### దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం

తిరుమల,ఏప్రిల్28 : భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో పాటు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్ఓ మురళీకృష్ణ, టిటిడి సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగా నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో భారత ఉపరాష్ట్రపతికి పండితులు వేదాశీర్వచనం చేయగా.. తితిదే ఛైర్మన్, ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. సోమవారం విశాఖ ఆంధ్రావర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా ఇక్కడికి చేరుకున్నారు. ఆయనకు స్థానిక నేతలు, అధికారులు స్వాగతం పలికారు.

## తరుపేరుతో రైతుల లూటీ

### ఆందోళనకు దిగిన రైతులు

నల్లగొండ,ఏప్రిల్28 :గట్టుప్పల్ మండలంలోని తెరట్పల్లి గ్రామంలో రైతు సేవా సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం వద్ద రోడ్డుపై కూర్చొని రైతులు ధర్నా చేశారు. తేమ, తరుగు పేరుతో క్వింటాకు 8 కిలోలు కోత విధిస్తున్నారని వాపోయారు. ధాన్యం కోత వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.

## జిల్లాలో సాధారణ స్థితికి పెట్రోల్, డీజిల్‌కు సరఫరా..

### ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పెట్రోల్ డీజిల్ సరఫరా పర్యవేక్షణ..

### వినియోగదారుల అవసరాలకు అందుబాటులో పెట్రోల్ డీజిల్..

### జిల్లాలో ప్రతి రోజు 8 లక్షల డీజిల్ 6 లక్షల పెట్రోల్ సరఫరా..

### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.



విజయవాడ,ఏప్రిల్28 : జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుందని ప్రస్తుతం ఎటువంటి కొరత లేకుండా ఇంధనం సమృద్ధిగా అందుబాటులో ఉందని వినియోగదారులు ఎటువంటి అందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో పెట్రోల్ డీజిల్ సరఫరా పై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పర్యవేక్షణ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిడమానూరులో హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ బంకులను ఎనికెపాడులోని హెచ్‌పిసిఎల్ బంకును రామవరప్పాడులోని ఐఓసిఎల్ బంకులలో పెట్రోల్ డీజిల్ నిల్వలు సరఫరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వదంతుల కారణంగా పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పాటుడుందనే అపోహలతో వినియోగదారులు బయాందోళనలకు గురై అవసరాలకు మించి డీజిల్ పెట్రోల్ కొనుగోళ్ళు చేయడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. డీజిల్ పెట్రోల్ సజావుగా వినియోగదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల కారణంగా పెట్రోల్ డీజిల్ సరఫరా సాధారణ స్థితికి చేరుకోవడం జరిగిందన్నారు. ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలోని పెట్రోల్ బంక్‌ల వద్ద సరఫరా పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్ సరఫరా కొనసాగుతున్నదని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. అపోహలు, అసత్య ప్రచారాలను నమ్మకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రతి రోజు సుమారు 8 లక్షల లీటర్ల డీజిల్, 6 లక్షల లీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతోందని కలెక్టర్ వెల్లడించారు. ఆయిల్ కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ పోలీస్ వ్యవసాయ తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, ఎక్కడా ఇంధన కొరత ఏర్పడకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నారన్నారు. ఈకారణంగా పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్‌లలో వాహనాలు నిలబడాల్సిన అవసరం లేకుండా తక్షణమే ఆయిల్ పొందగలుగుతున్నారన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీలలో పెట్రోల్ డీజిల్ అవసరాల మేరకు నిల్వలతో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. బంకులలో ఆయిల్ అయిపోయిన రెండు గంటలలోపే ట్యాంకర్లతో ఆయిల్ సరఫరా చేసేలా మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, అవసరానికి తగినంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో ఇంధన సరఫరా పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంధన సరఫరాపై ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ఇందుకోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని వినియోగదారులకు ఇబ్బంది తలెత్తిన పక్షంలో 9154970454 నందు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. ఆయిల్ బంకుల పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ వెంట విజయవాడ రూరల్ తహాశీల్దార్ బి. సుగుణ, రెవెన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐ యుగంలో గూగుల్ డేటా సెంటర్ కీలకం

### గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా ఆంధ్రప్రదేశ్ పరుగులు

### గూగుల్ క్లౌడ్, గ్లోబల్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే

విశాఖపట్నం,ఏప్రిల్ 28 : ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరిగింది. మంగళవారం ఉదయం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమి పూజ చేశారు. వన్ గిగా వాట్ సామర్థ్యంతో రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో మెగా డేటా సెంటర్‌ను గూగుల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. డేటా సెంటర్‌కు తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో మొత్తం 600 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అన్ని రకాల అనుమతులను సర్కార్ క్లియర్ చేసింది. ఈ సందర్భంగా గూగుల్ క్లౌడ్, గ్లోబల్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే మాట్లాడుతూ... గూగుల్ ఇండియా ఏఐ హబ్‌కు ఇవాళ చేసిన శంకుస్థాపన 2047 వికసిత్ భారత్‌కు ఓ పునాదిరాయి లాంటిదన్నారు. ఏఐ యుగంలో విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఈ డేటా సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. భారత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లోనూ ఈ డేటా సెంటర్ అత్యంత ముఖ్యమైనదని చెప్పుకొచ్చారు. గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా ఇప్పుడు విశాఖ, ఆంధప్రదేశ్ పరుగులు పెడుతోందని అన్నారు. ఇంటర్నేషనల్ సబ్ సీ గేట్ వేగా ఉన్న ముంబై, చెన్నైలతో పాటు విశాఖ కూడా కీలకంగా మారిందని వెల్లడించారు. కొత్త ఫైబర్ ఆప్టిక్ లైన్లు ఇతర ప్రాంతాలతో విశాఖను అనుసంధానం చేస్తాయని బికాస్ కోలే తెలిపారు. సముద్ర గర్భ లైన్లతో సంప్రదాయ నౌకాయాన మార్గాలు ఇక డిజిటల్ ట్రేడ్ రూట్లుగా మారతాయన్నారు. అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ట్రాలు ఈ డేటా సెంటర్ ఏర్పాటులో భాగస్వామ్యం వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఎదుగుతున్న ఈ ప్రాంతానికి టెక్ ఫ్యూచర్‌ను అందించేలా ఈ డేటా సెంటర్ ఉంటుందని చెప్పారు. స్థానిక యువతకు ఉద్యోగ భద్రత, ఇంధన భద్రత, నీటి వినియోగం లాంటి అంశాలతో స్థానిక భాగస్వామ్యంతో ముందుకు అడుగులు వేస్తామన్నారు. యువతకు భవితను అందించేలా వారికి అడ్వాన్స్‌డ్ క్లౌడ్, ఏఐలో శిక్షణ కార్యక్రమాలను గూగుల్ నిర్వహిస్తుందని తెలిపారు. 10 వేల మందికిపైగా మహిళలకు మైక్రో ఎంటప్రైజ్‌గా మారేందుకు సహకారం అందిస్తుందని అన్నారు. న్యూ ట్రాన్స్ మిషన్ లైన్లు, ఎనర్జీ స్టోరేజి సిస్టమ్స్ లాంటివి ఈ ప్రాంతానికి ఇంధన భద్రతను కల్పిస్తాయన్నారు. విశాఖలోని వివిధ నివాస ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణతో పాటు ఈ ప్రాంతానికి ఆర్థిక స్థిరత్వం కల్పించేలా ఈ డేటా సెంటర్ నిర్మితం అవుతుందని బికాస్ కోలే వెల్లడించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస్ వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, బాల వీరాంజనేయ స్వామి, సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి విమర్శలు

### గూగుల్‌కు శంకుస్థాపన వేళ విపరీత ప్రచారాలు

### తమ పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వారే విమర్శలా

### వైసిపి తీరుపై మండిపడ్డ మంత్రి పార్థసారథి

మచిలీపట్నం,ఏప్రిల్28 : పెట్రోల్, డీజిల్ సమస్యపై వైసీపీ భయాందోళన పరిస్థితులు సృష్టిస్తోందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి మండిపడ్డారు. మధ్యాహ్నం మూడు గంటలకల్లా రాష్ట్రంలో కొరత ఉన్న 75 శాతం బంకుల్లో ఆయిల్ సరఫరా చేశామన్నారు. బుధవారానికి పరిస్థితి పూర్తిగా అదుపులోకి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్యలపై కృష్ణా జిల్లా మొవ్వ మండలం కారకంపాడులో మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. అంతర్జాతీయ గూగుల్ సంస్థ విశాఖపట్నంలో శంకుస్థాపన జరుగుతున్న వేళ.. అది చూసి ఓర్వలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు వైసీపీ శాయశక్తులా కృషి చేస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏం పరిశ్రమలు తెస్తున్నారంటూ వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారని మంత్రి పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగాయని.. ఇవన్నీ కనిపించడం లేదా? అంటూ వైసీపీ నేతలకు ఈ సందర్భంగా మంత్రి చురకలంటించారు. దేశంలో 25 శాతం పెట్టుబడులు మనరే వస్తున్నాయని వివరించారు. 2019-24లో ఎంత మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారో మీరు మర్చిపోయారా? అంటూ వైసీపీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ప్రతిపక్షమే ఒక పెద్ద దౌర్భాగ్యంగా తయారైందని మండిపడ్డారు. వారికి చట్ట సభల్లో ప్రశ్నించే ధైర్యం లేదన్నారు. వైసీపీ కావాలనే పానిక్ సిట్యువేషన్ సృష్టిస్తోందని ఆరోపించారు. దీంతో ప్రజలు భయపడి పెట్రోల్, డీజిల్ అధికంగా కొనుగోలు చేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ సమస్యపై సీఎం చంద్రబాబు నాయుడు రోజూ సమీక్షిస్తున్నారని మంత్రి పార్థసారథి గుర్తు చేశారు. రైతులకు 6 నెలల్లో ఇవ్వలేని నగదును తాము 48 గంటల్లో ఇచ్చామని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి గుర్తు చేశారు. మొక్కజొన్న రైతుల సమస్యలపై కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. పొగాకు, కోకో, మామిడి రైతులకు నష్టం రాకుండా మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. ధరల స్థిరీకరణకు రూ.800 కోట్లు చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. రైతాంగ వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి.. ప్రస్తుతం మొసలి కన్నీరు కారుస్తున్నారంటూ వైసీపీ నేతల వైఖరిని మంత్రి పార్థసారథి ఎండగట్టారు. ప్రగల్భాలు మాని.. చిత్తశుద్ధి ఉంటే వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని వైసీపీ నేతలకు మంత్రి పార్థసారథి సూచించారు.

## ఉత్తరాంధ్రలో రూ.2 వేల కోట్లతో 11 కీలక ప్రాజెక్టులు

### 2.69 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు లక్ష్యంగా పనులు

### రెండేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు: మంత్రి నిమ్మల



అమరావతి,ఏప్రిల్28 : రానున్న రెండేళ్లలో ఉత్తరాంధ్రలో రూ.2 వేల కోట్లతో 11 కీలక ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా నిర్దేశించుకున్నారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కీలకమైన 11 ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో 2.69 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు 2.49 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమౌతుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తీసుకురావడంతో పాటు, కరువు ప్రాంతాలకు ప్రయోజనం కలిగించే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన వివరించారు. మంగళవారం అమరావతిలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. వంశధార ట్రిబ్యునల్ 2021 తీర్పును గెజిట్‌లో చేరుస్తూ నోటిఫికేషన్ ఇవ్వడంలో సీఎం చంద్రబాబు కృషి ఫలించిందని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌తో శ్రీకాకుళం జిల్లాలోని నేరడి బ్యారేజ్ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉత్తరాంధ్రలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. ఈ సమీక్షా సమావేశంలో నీటి పారుదల సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తితోపాటు ఉత్తరాంధ్రలోని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

BRANCH SHIFTING
మా విలువైన కస్టమర్ల కోసం, మా
PAKALA
బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి
13.07.2026 నుండి మార్చబడు
తుంది. నూతన చిరునామా క్రింద
ఇవ్వబడినది;
Muthoot Finance Ltd
Ground Floor, Market Street,
Opp. SBGR College, Near RTC Bus Stand,
Pakala, Thirupathi District,
Andhra Pradesh State, Pin - 517112.
Phone No - 09188903959, 08138909950.
Email id : mgpak2647@muthootgroup.com
"ఏదైనా ఫిర్యాదు ఉంటే
దయచేసి 0484 4804074
కు కాల్ చేయండి".
మీ నిరంతర చేయూత మరియు
మద్దతును కోరుతున్నాము.
Muthoot Finance
A Muthoot M George Enterprise

BRANCH SHIFTING
మా విలువైన కస్టమర్ల కోసం, మా
VIJAYAWADA - BHAVANI PURAM
బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి
13.07.2026 నుండి మార్చబడు
తుంది. నూతన చిరునామా క్రింద
ఇవ్వబడినది;
Muthoot Finance Ltd
Ground Floor, H.No : 76-13-100/1,
Near Church Centre,
Revenue ward - 29 A, Bhavanipuram,
Vijayawada, NTR District,
Andhra Pradesh State, Pin – 520012.
Phone No - 09188904179, 08138910698.
Email id : mgbha751@muthootgroup.com
"ఏదైనా ఫిర్యాదు ఉంటే
దయచేసి 0484 4804074
కు కాల్ చేయండి".
మీ నిరంతర చేయూత మరియు
మద్దతును కోరుతున్నాము.
Muthoot Finance
A Muthoot M George Enterprise



## వేసవిలో శరీరానికి చల్లదనాన్ని అందించే

# ప్రొటీన్ ఫుడ్

**వేసవి కాలంలో శరీరానికి తేలికగా, చల్లదనాన్ని అందించేలా ఉండే ప్రోటీన్ ఆహారాలను ఎంపిక చేయడం చాలా ముఖ్యం. అధిక ఉష్ణోగ్రతల సమయంలో శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించడానికి ఎక్కువ శ్రమ పడుతుంది. అందుకే ఈ సమయంలో తీసుకునే ఆహారం తేలికగా జీర్ణమయ్యేలా, శరీరానికి శక్తినిచ్చేలా ఉండాలి. కనుక ఇటువంటి సమయంలో ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.**

ప్రోటీన్ సాధారణంగా బరువు తగ్గడానికే ఉపయోగపడుతుందని అనుకుంటారు. కానీ వాస్తవానికి ఇది శరీర నిర్మాణానికి ప్రధాన మూలం. కండరాల పునరుద్ధరణ, రోగ నిరోధక శక్తి పెంపు, అలాగే ఎక్కువసేపు తృప్తిగా ఉండటానికి ఇది కీలకం. ముఖ్యంగా శరీరం ప్రోటీన్‌ను నిల్వ చేసుకోలేకపోవడం వల్ల ప్రతిరోజూ ఆహారంలో చేర్చడం అవసరం. వేసవిలో ప్రోటీన్ ఆహారాలను ఎంచుకునే సమయంలో అవి తేలికగా, హైడ్రేటెడ్‌గా, జీర్ణానికి సులభంగా ఉండేలా చూసుకోవాలి. దీంతో శరీరంలో అధిక వేడి పెరగకుండా, శక్తి స్థాయిలు సంతుల్యంగా ఉంటాయి. వేసవి కాలంలో తీసుకోవాల్సిన ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.

### చికెన్ బ్రెస్ట్, చేపలు, పనీర్..

లీన్ మీట్స్‌గా చెప్పబడే చికెన్ బ్రెస్ట్, చేపలు వేసవిలో మంచి ఎంపిక. ఇవి ప్రోటీన్ ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉండటం వల్ల శరీరానికి తేలికగా అనిపిస్తాయి. పప్పులు, శనగలు, పెసర్లు వంటి లెగ్యూమ్స్ కూడా ప్రోటీన్‌కు మంచి వనరులు. వీటిని సలాడ్స్‌లో, చల్లని వంటల్లో లేదా హమ్మస్‌లాంటి వంటకాల రూపంలో తీసుకోవచ్చు. శాకాహారులకు ఇవి ఉత్తమ ఎంపిక అని చెప్పవచ్చు. అలాగే గ్రీక్ యోగర్ట్ వేసవిలో చల్లగా తినడానికి అనువైన ప్రోటీన్ ఆహారం. దీన్ని పండ్లతో కలిపి లేదా స్మూతీగా తీసుకుంటే శరీరానికి తేలికగా ఉంటుంది. అలాగే ఇందులో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణక్రియకు సహాయపడతాయి. అదే విధంగా కాటేజ్ చీజ్ (పనీర్) కూడా ప్రోటీన్ ను సమృద్ధిగా కలిగి ఉంటుంది. దీన్ని కర్రీల్లో, పరాటాల్లో లేదా సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు. బాదం, అక్రోట్, చియా గింజలు, ఫ్లాక్స్ సీడ్స్ వంటి నట్లు, గింజలు ప్రోటీన్‌తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయి. ఇవి మధ్యాహ్నం ఆకలి వేయకుండా నిరోధిస్తాయి.

### మజ్జిగ, సత్తు పిండి..

మజ్జిగ (చాస్) వేసవిలో అత్యుత్తమ శీతల పానీయం. ఇది శరీరాన్ని చల్లగా ఉంచడంతో పాటు పొటాషియం, కాల్షియం వంటి ఖనిజాలను అందిస్తుంది. అలాగే గట్ హెల్త్‌కి కూడా ఉపయోగపడుతుంది. సత్తు (వేయించిన శనగ పిండి) వేసవిలో చాలా ప్రాచుర్యం పొందిన ఆహారం. ఇది శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడమే కాకుండా ఫైబర్‌ను సమృద్ధిగా అందిస్తుంది. కినోవా పూర్తిస్థాయి ప్రోటీన్ వనరు. దీనిలో అన్ని అవసరమైన అమినో ఆమ్లాలు ఉంటాయి. దీనిని సలాడ్స్‌లో లేదా చల్లని బౌల్స్‌గా తీసుకోవచ్చు. టోఫు, టెంపె వంటి ప్లాంట్-బేస్డ్ ప్రోటీన్ ఆహారాలు కూడా వేసవిలో అనువైనవి. వీటిని గ్రిల్ చేసి లేదా సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు. వేసవి కాలంలో తేలికగా, శరీరాన్ని చల్లగా ఉంచే ప్రోటీన్ ఆహారాలను తీసుకోవడం ద్వారా శక్తివంతంగా, ఆరోగ్యంగా ఉండవచ్చు. సరైన ఆహారపు అలవాట్లు వేసవి ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

# ఆత్మవిశ్వాసం ఆవిరైందా?

## అధికార పీఠంపై రేవంత్ రెడ్డికి పట్టు సడలుతోందా?

**తెలంగాణ రాజకీయ యవనికపై అనూహ్య పరిణామాల మధ్య ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన రేవంత్ రెడ్డి, తన పదవీ కాలంపై స్వయంగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనానికి దారితీశాయి. ఒకవైపు 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని బహిరంగ సభల్లో ధీమా వ్యక్తం చేస్తున్న రేవంత్, మరోవైపు ప్రైవేట్ వేదికలపై అందుకు భిన్నంగా మాట్లాడుతుండటం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.**



ఇటీవల ఒక ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ, "నేను 2028 డిసెంబర్ వరకు మొదటి విడత ముఖ్యమంత్రిగా ఉంటాను.. ఈ లోపే మీరు మరిన్ని ఆసుపత్రులు నిర్మించి నన్ను పిలవాలి" అని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. బహిరంగంగా పదేళ్ల పాలన గురించి మాట్లాడే రేవంత్, ఇలా 'మొదటి విడత' అంటూ గడువు విధించుకోవడం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటనే ప్రశ్న ఉదయిస్తోంది. ఇది కేవలం మాట వరుసకు అన్నదా లేక తన రాజకీయ భవిష్యత్తుపై ఆయనకు కలిగిన ముందస్తు అవగాహనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి తన పదవీ కాలంపై ఇటువంటి పరిమిత వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

### మరుతున్న ప్రజా నాడి

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందనే వాదనలు గత కొంతకాలంగా బలంగా వినిపిస్తున్నాయి. ఏప్రిల్ 2026 నాటి నివేదికల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యం, విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వంటి అంశాలు సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పాఠశాల స్థాయి ఎన్నికల్లో కూడా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఉదహరిస్తూ విద్యార్థులు మాట్లాడుకుంటున్నారంటే, ప్రభుత్వ విశ్వసనీయత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నప్పటికీ, ప్రస్తుత పాలనలో ప్రజల అసహనం మరింత పదునెక్కిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే ఇన్ని విమర్శలు మూటగట్టుకోవడం రేవంత్ రెడ్డికి ఆందోళన కలిగించే విషయమే. బహుశా ఈ ప్రతికూల పవనాల వల్లే, మళ్ళీ అధికారంలోకి రావడం కష్టమనే సంకేతాలను ఆయన తన మాటల ద్వారా పరోక్షంగా ఇస్తున్నారా అనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

### పేదల ఆరోగ్యానికి శాపమా?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి కంటే ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాంధీ, నిమ్స్ లేదా జిల్లాల్లోని ప్రభుత్వ వైద్యాలయాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సింది పోయి, బడా కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించడం గమనార్హం. ఒక ముఖ్యమంత్రిగా ప్రైవేట్ ఆసుపత్రులలో పేదలకు కనీసం కొంత శాతమైనా రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేయాల్సింది పోయి, వారు వందలాది శాఖలు విస్తరించాలని కోరుకోవడం బాధ్యతారాహిత్యమని కొందరు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో సామాన్యులకు వైద్యం అందని ద్రాక్షగా మారుతున్న తరుణంలో, ప్రభుత్వ పెద్దలు ప్రైవేట్ శక్తులకు మద్దతుగా నిలవడం నైతికంగా ఏమాత్రం సమర్థనీయం కాదు. ఈ కార్పొరేట్ అనుకూల విధానం వల్ల భవిష్యత్తులో సామాన్య ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి క్రమంగా దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ప్రజల రక్తం పిండే సంస్థల కంటే ప్రజల పక్షాన నిలిచే ప్రభుత్వ యంత్రాంగంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### రాజకీయ అనిశ్చితి.. ప్రజా తీర్పు

మొత్తానికి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఆయనలో ఉన్న నైతిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలో హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకోవడంలో సఫలమైనప్పటికీ, స్థానికంగా ప్రజల నమ్మకాన్ని గెలవడంలో ఆయన వెనుకబడ్డారని విశ్లేషణలు చెప్తున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే మీడియా కథనాలను లేదా ప్రజా ఉద్యమాలను బేఖాతరు చేయమని తన అనుచరులకు సూచించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య. అధికారం అనేది శాశ్వతం కాదని, అది కేవలం ప్రజలు ఇచ్చిన ఒక గొప్ప అవకాశమని గుర్తించకపోతే రాజకీయ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. కేవలం ప్రైవేట్ సంస్థల ప్రయోజనాల కోసం పనిచేస్తూ, ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే.. 2028లో ప్రజలు ఇచ్చే తీర్పు రేవంత్ రెడ్డి ఊహించిన దానికంటే అత్యంత పదునుగా ఉండవచ్చు.

ఉక్కల్ కర్
రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170



# పరిమిత మోతాదులో సేవిస్తే కాఫీతో లాభాలు..



ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాల్లో కాఫీ ఒకటి. సాధారణంగా కాఫీని నిద్రలేమి, ఆందోళన, గుండె వేగం పెరగడం, జీర్ణ సమస్యలు వంటి ప్రతికూల ప్రభావాలతో అనుసంధానిస్తారు. అయితే కాఫీ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని నిపుణులు తెలియజేస్తున్నారు. రోజుకు ఒకటి లేదా రెండు కప్పుల కాఫీని రెండు వారాల పాటు నియమితంగా తీసుకుంటే శరీరంపై పలు సానుకూల ప్రభావాలు కనిపిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు.

### లివర్ ఆరోగ్యానికి..

కాఫీ కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నియమితంగా కాఫీ తాగడం వల్ల ఫ్యాటీ లివర్, ఫైబ్రోసిస్, సిర్రోసిస్ వంటి సమస్యల ప్రమాదం తగ్గుతుంది. దీని వల్ల లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. అలాగే కాఫీ మెటబాలిజాన్ని మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే క్లోరోజెనిక్ ఆమ్లాలు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి శరీరంలోని మెటబాలిక్ ప్రక్రియలను సమర్థవంతంగా అమలు చేయడంలో సహాయపడతాయి. మెదడు పనితీరును ఉత్తేజపరుస్తుంది. కాఫీలోని కెఫీన్ అలర్ట్‌నెస్, దృష్టి, మానసిక పనితీరును పెంచి మెదడు సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కాఫీ సహాయపడుతుంది. ఇది పెద్దపేగును ఉత్తేజపరచి గట్ మొటిలిటీని పెంచడం ద్వారా జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది.

### వీరు మితంగా తీసుకోవాలి..

అయితే కాఫీ వినియోగంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. IBS లాంటి సమస్యలు ఉన్నవారు కాఫీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. సాధారణంగా పెద్దలకు రోజుకు ఒకటి నుంచి రెండు కప్పుల బ్లాక్ కాఫీ సరిపోతుంది. కానీ గుండె దడ, ఆందోళన, ఆమ్లత్వం లేదా నిద్ర సమస్యలు ఉంటే కాఫీని తగ్గించడం లేదా మానేయడం మంచిది. కాఫీలో అధికంగా చక్కెర లేదా ప్రాసెస్ చేసిన క్రీమ్‌లను కలపడం ఆరోగ్యానికి హానికరం. వీటిని తగ్గించడం అవసరం. కాఫీ తాగేటప్పుడు కొంత చల్లారిన తర్వాత తేనె కలపడం లేదా స్టీవియా, మాంక్ ఫ్రూట్ వంటి సహజ తీపి పదార్థాలను ఉపయోగించడం మంచిది. సరైన పరిమాణంలో, సరైన విధంగా తీసుకుంటే కాఫీ శరీరానికి పలు ప్రయోజనాలు అందించే పానీయంగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.




## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. చమురు భగభగలు, అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలతో మన సూచీలు నష్టాల్లో కదలాడాయి. దాంతో సెన్సెక్స్ 400 పాయింట్ల మేర నష్టపోయింది. ఉదయం సెన్సెక్స్ 77,094 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 77,493 పాయింట్ల గరిష్ఠానికి.. 76,741 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది. చివరకు 416 పాయింట్ల నష్టంతో 76,886 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 97 పాయింట్లు కోల్పోయి, 23,995 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 41 పైసలు కోల్పోయి, చివరకు 94.56కు చేరింది. నిఫ్టీ సూచీలో ఓఎన్‌జీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస, కోల్ ఇండియా, రిలయన్స్, నెస్లే షేర్లు రాణించగా.. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మారుతీ సుజుకీ, శ్రీరామ్ ఫైనాన్స్ స్టాక్స్ నష్టపోయాయి.




### కారణాలివీ..

వరుసగా 3 రోజుల నష్టాల తర్వాత, సోమవారం దేశీయ సూచీలు లాభాల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. దాంతో నేటి ట్రేడింగ్‌లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. బ్యాంకింగ్, ఐటీ, రియాల్టీ షేర్లు నష్టపోయాయి. మరోపక్క చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 110 డాలర్లు దాటింది. విదేశీ సంస్థాగత మదుపర్లు తమ వాటాలను విక్రయించడమూ, మంగళవారమే డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు కావడమూనష్టాలకు కారణాలని తెలుస్తోంది.

# భారత్-న్యూజిలాండ్ మధ్య ఎఫ్‌టీఏ ఒప్పందం ఖరారు

## భారత్‌లో 20 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెట్టడానికి న్యూజిలాండ్‌కు అవకాశం

భారత్, న్యూజిలాండ్‌లు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకాలు చేశాయి. ద్వైపాక్షిక వాణిజ్యం సహా పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇరుదేశాలు ఈ డీల్ చేసుకున్నాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూశ్ గోయెల్, న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖ మంత్రి టాడ్ మెక్‌క్లే ఈ ఎఫ్‌టీఏ డీల్‌పై సంతకాలు చేశారు. ఈ ఎఫ్‌టీఏ వల్ల భారత్‌కు ఎంతో మేలు చేకూరనుంది. ముఖ్యంగా భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి చేసే 100 శాతం ఉత్పత్తులకు కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయింపు లభిస్తుంది. అంటే అన్ని ఉత్పత్తి కేటగిరీలకు, అన్ని టారిఫ్ లైన్లకు ప్రవేశ పన్నుల నుంచి మినహాయింపు దొరుకుతుంది. దీనివల్ల వస్త్రాలు (టెక్స్‌టైల్స్), దుస్తులు (అపెరల్స్), (తోలు) లెదర్, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ప్రాసెస్డ్ ఫుడ్స్ లాంటి రంగాల్లో పోటీతత్వం పెరుగుతుంది. తద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, ఉపాధి కల్పనకు మంచి ఊతం లభిస్తుంది. ఇంతకు ముందు, సెరామిక్స్, కార్పెట్లు, ఆటోమొబైల్స్, ఆటో విడిభాగాలతో సహా కీలకమైన భారతీయ ఎగుమతులపై న్యూజిలాండ్ గరిష్ఠంగా 10 శాతం వరకు సుంకాలు విధించేది. కానీ తాజాగా ఎఫ్‌టీఏ ఖరారు కావడంతో, న్యూజిలాండ్‌లోకి భారతీయ ఉత్పత్తులు ఎలాంటి సుంకం లేకుండా ప్రవేశించగలుగుతాయి. అందువల్ల ఇతర దేశాల ఉత్పత్తులతో భారతీయ వస్తువులు పోటీపడగలుగుతాయి. అంతేకాదు ఈ డీల్ వల్ల, తయారీ రంగానికి అవసరమైన చెక్క దుంగలు (వుడెన్ లాగ్స్), కోకింగ్ కోల్, లోహాల వ్యర్థాలు (స్క్రాప్) వంటి పదార్థాలను సుంకం లేకుండానే దిగుమతి చేసుకునే వెసులుబాటును భారత్ పొందింది. ఇది ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, భారత పరిశ్రమలు ప్రపంచ మార్కెట్లతో మరింతగా పోటీపడడానికి వీలు కల్పిస్తుంది.



### సుంకాల సరళీకరణ

మరోవైపు భారత్ తన 70.03 శాతం టారిఫ్ లైన్లపై సుంకాలను సరళీకరించింది. ఇది ఇరుదేశాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువలో 95 శాతం ఉండడం గమనార్హం. అయితే భారతదేశంలోని సున్నితమైన రంగాలను రక్షించడానికి 29.97 శాతం టారిఫ్ లైన్లను మాత్రం మినహాయింపుల జాబితాలో ఉంచింది.

### వీటికి మినహాయింపు

ఈ మినహాయింపు జాబితాలో ప్రధానంగా ఉన్నవి ఏమిటంటే, పాల ఉత్పత్తులు (పాలు, క్రీమ్, పెరుగు, చీజ్ మొదలైనవి), జంతు ఉత్పత్తులు (గొర్రె మాంసం మినహా), వ్యవసాయ ఉత్పత్తులు (ఉల్లిపాయలు, శనగలు, బఠానీలు, మొక్కజొన్న, బాదం), చక్కెర, కృత్రిమ తేనె, జంతు/వృక్ష సంబంధిత కొవ్వులు, నూనెలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, రత్నాలు, ఆభరణాలు, రాగి- దాని అనుబంధ వస్తువులు (కాథోడ్, కార్ట్రిడ్జ్‌లు, రాడ్‌లు, బార్‌లు, కాయిల్స్), అల్యూమినియం- దాని అనుబంధ వస్తువులు (ఇంగాట్స్, బిల్లెట్లు, వైర్ బార్‌లు) మొదలైనవి.

### న్యూజిలాండ్‌కు కలిగే లాభాలు ఇవే!

మరోవైపు ఈ డీల్ ద్వారా న్యూజిలాండ్‌కు చెందిన 30 శాతం టారిఫ్ లైన్లపై భారత్ సుంకాలను రద్దు చేసింది. ఇందులో కలప, ఉన్ని, గొర్రె మాంసం, లెదర్-రా హైడ్స్ లాంటి వస్తువులున్నాయి. అదే విధంగా 35.60 శాతం టారిఫ్ లైన్స్‌పై 3, 5, 7, 10 సంవత్సరాల కాల పరిమితిలో దశలవారీగా సుంకాలు తొలగించనున్నారు. వీటిలో పెట్రోలియం ఆయిల్, మాల్ట్ ఎక్స్‌ట్రాక్ట్, వెజిటబుల్ ఆయిల్స్ సహా, కొన్ని ఎంపిక చేసిన ఎలక్ట్రిక్, మెకానికల్ యంత్రాలు, పెప్టోన్‌లు కూడా ఉన్నాయి. ఇక టారిఫ్ తగ్గింపుల వల్ల ప్రయోజనం పొందే న్యూజిలాండ్ ఉత్పత్తుల్లో వైన్, ఫార్మాస్యూటికల్ డ్రగ్స్, పాలిమర్‌లు, అల్యూమినియం, ఇనుము, ఉక్కు వస్తువులు ఉన్నాయి. మనుకా తేనె, యాపిల్స్, కివీ పళ్లు, మిల్క్ అల్బుమిన్‌తో కూడిన అల్బుమిన్‌లు వంటి కేవలం 0.06 శాతం వస్తువులు మాత్రమే టారిఫ్ రేట్ కోటాల కిందకు వస్తాయి.

### 20 బిలియన్ డాలర్ల పెట్టుబడి

అన్నికంటే ముఖ్యంగా ఈ ఎఫ్‌టీఏ ద్వారా భారత దేశంలో న్యూజిలాండ్ 20 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పించారు. దీని ద్వారా వచ్చే 15 ఏళ్లలో న్యూజిలాండ్ భారత్‌లో 20 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెట్టడానికి అవకాశం ఏర్పడింది. అంతేకాదు పెట్టుబడుల డెలివరీలో ఏమైనా లోపాలు ఉంటే, వాటిని పరిష్కరించేందుకు, పటిష్ఠమైన ఆర్థిక ఫలితాలను పొందేందుకు వీలుగా ఒప్పందంలో ఒక 'రీబ్యాలెన్సింగ్ క్లాజ్'ను కూడా చేర్చారు. వాస్తవానికి ఇటీవలి కాలంలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వస్తు వాణిజ్యం హెచ్చుతగ్గులకు గురైంది. కానీ సేవల వాణిజ్యం మాత్రం ఊపందుకుంది. 2024లో న్యూజిలాండ్‌కు భారత సేవల ఎగుమతులు సుమారు 13 శాతం మేర పెరిగి 634 మిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు సుమారు 7 శాతం పెరిగి 611 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

# క్రెడిట్ కార్డు మినిమమ్ బిల్లు చెల్లిస్తున్నారా?

## బిల్లు చెల్లింపులో జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు!

**ప్రస్తుత రోజుల్లో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగిపోయింది. ఈ కార్డులు వచ్చాక కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయడం ఈజీ అయిపోయింది. చేతిలో చిల్లగవ్వ లేకపోయినా క్రెడిట్ కార్డు ఉంటే చాలు.. కావాల్సినంత షాపింగ్ చేసేయొచ్చు. ఇదే క్రమంలో కొన్నిసార్లు చెల్లించాల్సిన బిల్లు పెద్ద మొత్తంలో ఉంటుంది. అలాంటి టైమ్‌లో చాలా మంది మినిమమ్ బిల్లు కట్టేస్తుంటారు. క్రెడిట్ కార్డు బిల్లు పేమెంట్‌కు సరిపడా డబ్బులు లేనప్పుడు ఇదే పద్ధతి ఫాలో అవుతుంటారు ఎక్కువ మంది.**

మీరూ క్రెడిట్ కార్డు బిల్లును ఇలానే పే చేస్తున్నారా? అయితే, వెంటనే అలా కట్టడం మానుకోవడం మంచిదని సూచిస్తున్నారు ఆర్థిక నిపుణులు. ఎందుకంటే "క్రెడిట్ కార్డు మినిమమ్ బిల్లు పే" చేయడం వల్ల కొన్ని లాభనష్టాలు ఉంటాయంటున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

సాధారణంగా క్రెడిట్ కార్డు బిల్లు పేమెంట్‌లో మూడు రకాల ఆప్షన్లు ఉంటాయి. అవేంటంటే, ఫుల్ అమౌంట్(పూర్తి మొత్తం), మినిమమ్ డ్యూ, అదర్ అమౌంట్. ఇందులో ఏ నెలకానెల మొత్తం బిల్లు కట్టేస్తే ఎలాంటి ఇబ్బంది లేదు. అలాకాకుండా ఆ నెల బిల్లులో మొత్తం కట్టకుండా కొంతమొత్తం మాత్రమే చెల్లించడాన్ని 'మినిమమ్ డ్యూ లేదా మినిమమ్ అమౌంట్ పేమెంట్' అంటారు. చాలా వరకు క్రెడిట్ కార్డు సంస్థలు మొత్తం బిల్లులో ఐదు శాతం అమౌంట్‌ను మినిమమ్ డ్యూగా చూపిస్తాయి. సంస్థ లేదా బ్యాంకును బట్టి ఈ మొత్తంలో స్వల్ప మార్పులుండొచ్చు.




క్రెడిట్ కార్డులు వాడే వారిలో చాలా మంది మినిమన్ డ్యూ చెల్లిస్తే ఎలాంటి వడ్డీ పడదని అనుకుంటారు. కానీ, అది వాస్తవం కాదంటున్నారు నిపుణులు. మినిమమ్ డ్యూ చెల్లిస్తే పెనాల్టీలు, లేటు ఫీజుల నుంచి మాత్రమే మీకు ఊరట దక్కుతుందని చెబుతున్నారు. మీరు చెల్లించాల్సిన మొత్తం బిల్లుపై మాత్రం ఆయా క్రెడిట్ కార్డు సంస్థలు భారీగా వడ్డీని వసూలు చేస్తాయని సూచిస్తున్నారు. అలాగే, ఈ వడ్డీ 48 శాతం వరకు ఉంటుందంటున్నారు.

ఉదాహరణకు ఒక వ్యక్తి ఫిబ్రవరిలో క్రెడిట్ కార్డుతో రూ.20 వేల వరకు ఖర్చు చేశాడనుకుందాం. మార్చిలో మొత్తం బిల్లు కట్టాల్సి ఉంటుంది. అయితే, ఆ నెల అతను డబ్బులు లేకపోవడం వల్ల మినిమమ్ బిల్లుగా రూ.1000 కట్టాడు. అంటే, వచ్చే నెలలో అతను 19 వేలు రూపాయలు చెల్లిస్తే సరిపోతుందని అనుకుంటాడు. కానీ, అది నిజం కాదు. తర్వాత నెలలో అతను ఆ 19 వేల రూపాయలతో పాటు వడ్డీని కూడా చెల్లించాలి. ఈ వడ్డీ అత్యధికంగా 36 నుంచి 48 శాతం వరకు ఉంటుంది. ఒకవేళ ఆ నెల కూడా కొంత మొత్తం షాపింగ్ చేస్తే అది కూడా తర్వాతి నెల బిల్లింగ్‌లో పే చేయాల్సి ఉంటుంది.

## ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజీ (ఐజీఎక్స్)లో

# 1 శాతం వాటా విక్రయం!

స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం.. ఎన్ఎస్ఈ తాజాగా ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజీ(ఐజీఎక్స్)లో 1 శాతం వాటా విక్రయించింది. నేచురల్ గ్యాస్ డెలివరీ ఆధారిత ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ ఐజీఎక్స్‌లో వాటాను నియంత్రణ సంస్థల నిబంధలనమేరకు అమ్మినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఐజీఎక్స్‌లో ఏ ఒక్క సంస్థ 25 శాతానికి మించి వాటాను కలిగి ఉండటాన్ని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ నియంత్రణ సంస్థ(పీఎన్‌జీఆర్‌బీ) మార్గదర్శకాలు అనుమతించవు. నేచురల్ గ్యాస్‌లో స్పాట్, ఫార్వార్డ్, డెలివరీ ఆధారిత కాంట్రాక్టులకు ఐజీఎక్స్ నిర్వహించే ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ వీలు కల్పించే సంగతి తెలిసిందే. కాగా.. తాజా వాటా విక్రయం తదుపరి ఐజీఎక్స్‌లో ఎన్ఎస్ఈ వాటా 25 శాతానికి పరిమితమైంది. 2021 మార్చిలో ఎన్ఎస్ఈ రూ. 19 కోట్లకు ఐజీఎక్స్‌లో 26 శాతం వాటాను సొంతం చేసుకుంది. పీఎన్‌జీఆర్‌బీ నుంచి అనుమతులు పొందడం ద్వారా ఐజీఎక్స్‌కు సహప్రమోటర్‌గా అవతరించింది. దేశీ నేచురల్ గ్యాస్ ధరల ఆధారంగా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ డెరివేటివ్స్‌కు తెరతీసేందుకు వీలుగా ఎన్ఎస్ఈ ఈ నెల మొదట్లో ఐజీఎక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్న విషయం విదితమే. వెరసి ఐజీఎక్స్ ప్రామాణిక ధరల ఇండెక్స్ జీక్సీ ఆధారంగా గ్యాస్ ఫ్యూచర్ కాంట్రాక్టులకు శ్రీకారం చుట్టనుంది. ఇక మరోపక్క ఐజీఎక్స్ ఈ జనవరిలో పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు చేపట్టింది. ఈ ఏడాది డిసెంబర్‌కల్లా ఐపీవో చేపట్టాలని భావిస్తోంది. 2026 జూన్‌లోగా సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసే వీలున్నట్లు ఎండీ, సీఈవో రాజేష్ కుమార్ ఎం. పేర్కొన్నారు.

## వైభవంగా అయ్యప్ప జన్మ నక్షత్ర పూజలు



**చేర్యాల ఏప్రిల్ 28 (నినాదం):** చేర్యాల మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి ఉత్తర నక్షత్రం పూజలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు తాటిపెల్లి ఆంజనేయులు గుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో భాగంగా చేర్యాల పట్టణానికి చెందిన యంసాని లావణ్య -శివకుమార్, గందె అరుణదేవి-అశోక్ దంపతులు స్వామి వారికీ హోమం, అష్టద్రవ్య ఫల అభిషేకం, అలంకరణ, పుష్పార్చన తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి భావం చాటారు. అనంతరం భక్తులకు తీర్దప్రసాదలతో పాటు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి ఆగమ పాఠశాలలో వార్షిక పరీక్షలు



**కొమురవెల్లి, ఏప్రిల్ 28 ( నినాదం):** సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం పరిధిలో ఆగమ పాఠశాలలో మంగళ వారం రోజున విద్యార్థులకు వార్షిక పరీక్షలను నిర్వహించారు. తెలంగాణ దేవాదాయ శాఖ ఆగమ సలహా మండలి సభ్యులు, ప్రముఖ ప్రొఫెసర్ డాక్టర్ మహంతయ్య స్వామి ఆధ్వర్యంలో ఈ పరీక్షల ప్రక్రియ కొనసాగింది. అత్యంత క్రమశిక్షణతో, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల అనంతరం ఆగమ పాఠశాల విద్యార్థులకు ఏప్రిల్ 29 నుండి జూన్ 10వ తేదీ వరకు వేసవి సెలవులను ప్రకటించారు. సెలవుల అనంతరం తిరిగి జూన్ 11 నుండి పాఠశాల యథావిధిగా ప్రారంభమవుతుందని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారీ డి.కృష్ణప్రసాద్, సహాయ కార్యనిర్వహణాధికారులు ఆర్. సుదర్శన్, బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ మధుకర్ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవంతంగా బీజేపీ సంకల్పయాత్ర

### బిజెపి రాష్ట్ర మున్సిపల్ సేల్ కో కన్వీనర్ రావుల శేషగిరి



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 28 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ లో బతుకమ్మ బండ లో 9వ రోజు గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ బిజెపి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి చేపట్టిన సంకల్ప యాత్ర విజయవంతంగా కొనసాగుతుంది. అందులో భాగంగా తొమ్మిది రోజులు తొమ్మిదవ రోజు సంకల్పయాత్ర మంగళవారం రావుల శేషగిరి పార్టీ ముఖ్య నేతలతో కలిసి బీజేపీ జండా ను ఆవిష్కరించి సంకల్ప యాత్ర ను ప్రారంభించారు, గడపగడపకు బిజెపి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటినీ సందర్శించి, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజల ఆశీస్సులు పొందుతూ, మోదీ పాలనపై వారి నమ్మకం అద్భుతం అని ప్రజలు చెప్పుకోవడం అభినందనీయమని సంకల్ప యాత్రలో రావుల శేషగిరి వివరించారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాస్ రెడ్డి, మురళీకృష్ణ, శివానంద్, శారద, రమాదేవి, శ్రీధర్, మహేష్ ,సాకేత్ ,లక్ష్మణ్, శ్రీనివాస్, నవీన్, బాలకృష్ణ, వేణు, చందు, నగేష్ గురుస్వామి, జగదీష్ గురుస్వామి, భాస్కర్, చిన్న మురళి, మహేందర్ రెడ్డి, రావుల పృథ్వీ, కోకకోల శ్రీనివాస్, భరత్ కుమార్, పాలవలస రవి, చరణ్, రామారావు,వెంకటేష్, కార్తీక్, సిద్ధి రాములు, తదితర నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# రెండోరోజు పెట్రోల్ బంకుల వద్ద పడిగాపులు

### ఎట్టకేలకు క్యూపద్ధతిలో లభించిన పెట్రోల్

**వికారాబాద్, ఏప్రిల్ 27(నినాదం):** జిల్లాలో రెండవ రోజు పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు క్యూ కట్టి ఉన్న దృశ్యాలు దర్శమిచ్చాయి. కొన్ని బంకుల్లో నొస్టాక్ బోర్డులు అడ్డంగా తాళ్ళు కట్టిన దృశ్యాలు కనిపించాయి. అధికారులు కొరత లేదని కొట్టి పారెస్తున్న తరుణంలో క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ కొరత లేదని సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వివరణ ఇస్తున్నవిధంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితి లేకపోవడంతో వాహనాదారులు అయోమయానికి గురువుతున్నారు. కొన్ని బంకుల్లో ఇప్పట్లో పెట్రోల్ లభించదని తెలుసుకున్న వారు దూరప్రాంతంలో లభిస్తున్న బంకుల వద్దకు చేరి అధికంగా పెట్రోల్ తీసుకు వెళుతున్న విధానం జిల్లా వ్యాప్తంగా మంగళవారం కనిపించింది. అయితే అధికారులు చెబుతున్నట్లు పక్క రాష్ట్రాల్లో కొరత కారణంగా సమీప జిల్లాల బంక్‌లకు జనం క్యూ కడుతున్నారని తెలంగాణలో డిమాండ్‌కు తగిన సప్లై ఉందని సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొంటున్నారు.



తెలంగాణ మిడిల్ ఈస్ట్ లో టెన్షన్స్ కారణంగా క్రూడ్ ఆయిల్ కొరత కారణంగా దేశ వ్యాప్తంగా ఇంధన సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే రాష్ట్రం లో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర కీలక ప్రకటన చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో డిమాండ్ కు తగ్గ సప్లై ఉందన్నారు. వాహనదారులు భయాందోళనకు గురి కావొద్దని కోరారు. పలు కారణాలతో కొన్ని పెట్రోల్ బంక్ లు మూసివేసినా సమస్య పరిష్కారం కాగానే బంక్ లు ఓపెన్ చేస్తారని సివిల్ సప్లై కమిషనర్ తెలిపారు. పక్క రాష్ట్రాల్లో కొరత కారణంగా సమీప జిల్లాల్లోని బంకులకు వాహనదారులు భారీగా క్యూ కడుతున్నారు. పలు మండలాల్లో పలు ప్రాంతాల్లో వాహనదారులు భారీగా క్యూ కడుతున్నారు. ప్రత్యేకంగా ట్రాన్స్‌పోర్ట్ రంగంపై ఈ కొరత ప్రభావం ఎక్కువగా పడుతోంది. ట్రక్కులు గంటల తరబడి బంకుల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు డ్రైవర్లు దూర ప్రాంతాలకు వెళ్ళి డీజిల్ తీసుకురావాల్సి వస్తోంది. మరోవైపు, డిమాండ్ పెరగడం కూడా కొరతకు కారణమని అధికారులు భావిస్తున్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### చింతల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాక సమావేశంలో కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 28 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని చింతల్ సర్కిల్ ల్లోని చింతల్, రంగారెడ్డి నగర్, రోడా మేస్త్రి నగర్, జగద్గిరిగుట్ట, గిరి నగర్ డివిజన్లు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం ఈరోజు ఆదర్శ్ నగర్ లోని కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ ఈ కార్యక్రమానికి విచ్చేసిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీలో ముఖ్యమైన రేషన్ కార్డులు, పేదలకు సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, వృద్ధాప్య పెన్షన్ల తో పాటు ఇందిరమ్మ ఇండ్లు తదితర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, నాయకత్వాన్ని మరింత బలపరచాలని పేర్కొన్నారు. రాబోవు గ్రేటర్ మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అన్ని డివిజన్లో కాంగ్రెస్ ముఖ్య నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు బలంగా పనిచేసే వారికి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం దక్కుతుందని నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరికిచ్చినా మిగతా సభ్యులందరూ ఏకతాటిపై ఉండి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జై రామ్, కృష్ణ గౌడ్, జహంగీర్, మోటి శ్రీనివాస్ యాదవ్, ఏర్వ వెంకట రమణ, రమేష్ మంజుల్కర్, కాజా బాయ్, షాకీర్, రమణారెడ్డి, మధుసూదన్, బండారి నారాయణ, మల్లం శీను, బలరాం, తోకల శీను, వరమ్మ,శ్రావణ్, పద్మ, లావణ్య, శ్యామల అఖిల్, శ్రీకాంత్ గౌడ్, సలీం, రెహమాన్, చోటు, రాకేష్, అరుణ్, చింతల్ సర్కిల్ కు చెందిన ఐదు డివిజన్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు

### • విద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలి

**కీసర, ఏప్రిల్ 28, (నినాదం):** కీసర సర్కిల్, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. రవి రాజ్ రాథోడ్, స్కూల్ మాఫియా, కోచింగ్ మాఫియా, పుస్తకాల మాఫియా కలిసి సాధారణ ప్రజలను దోచుకుంటున్నారు. అడ్మిషన్ ఒకసారి తీసుకున్న తర్వాత విద్యార్థి పది సంవత్సరాలు లేదా పన్నెండు సంవత్సరాలు అదే విద్యాసంస్థలో చదువుతాడు. కానీ అడ్మిషన్ ఫీజు మాత్రం ప్రతి సంవత్సరం వసూలు చేస్తున్నారు. కొత్త విద్యా విధానం పదేళ్లకు ఒకసారి వస్తుంది, కానీ పుస్తకాలు మాత్రం ప్రతి సంవత్సరం మార్చేస్తున్నారు. ఎన్సీఈఆర్టీ పుస్తకాల విషయంలో కూడా గందరగోళం సృష్టించడం వల్ల అవి సులభంగా దొరకడం లేదు. ప్రైవేట్ పుస్తకాలు కొనాల్సి వస్తోంది. ఒకవైపు పుస్తకాల విక్రేతలు అధిక ధరలకు




పుస్తకాలు అమ్ముతూ దోపిడీ చేస్తున్నారు. మరోవైపు స్కూల్ యాజమాన్యాలు అడ్మిషన్ ఫీజుల పేరుతో దోచుకుంటున్నాయి. తరువాత నెలసరి ఫీజుల పేరుతో మళ్లీ భారాన్ని మోపుతున్నారు. ఏదైనా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినా అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. యూనిఫామ్ పేరుతో మరో దోపిడీ జరుగుతోంది. షూస్, సాక్స్ కూడా స్కూల్ సూచించిన చోటే కొనాలని ఒత్తిడి చేస్తున్నారు. దానికి కూడా అదనపు ఖర్చు పడుతోంది. పెన్సిల్ కొనాలి, పెన్సిల్ బాక్స్ కొనాలి, టిఫిన్ బాక్స్ కొనాలి, వాటర్ బాటిల్ కొనాలి అన్నా కూడా స్కూల్ సూచించిన దుకాణం నుంచే కొనాలని చెబుతున్నారు. అక్కడ కూడా అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రపంచ విషయాలపై మాట్లాడేవాళ్లు కూడా భారతదేశంలో సమాన విద్యా విధానం అమలు చేయాలని చెప్పడం లేదు. మనకంటే చిన్న దేశమైన నేపాల్ కూడా సమాన విద్యా విధానాన్ని అమలు చేసింది. మనకంటే పెద్ద దేశమైన చైనా చాలా కాలం క్రితమే సమాన విద్యా విధానాన్ని అమలు చేసింది. ప్రపంచంలోని అనేక చిన్నా, పెద్దా దేశాల్లో సమాన విద్యా విధానం ఉంది. కానీ భారతదేశంలో నాయకులు, రచయితలు, మేధావులు, ఎవరూ కూడా ఈ ప్రశ్న అడగడం లేదు. రాజ్యాంగం అందరికీ ఒకటే అయితే, చట్టం అందరికీ ఒకటే అయితే, ఓటు హక్కు అందరికీ ఒకటే అయితే, విద్య కూడా అందరికీ ఒకటే ఎందుకు ఉండకూడదు అని రవి రాజ్ రాథోడ్ అన్నారు. భారతదేశంలో సమాన విద్యా విధానం వెంటనే అమలు చేయాలని రవి రాజ్ రాథోడ్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను అణిచివేయలేరు



**చేర్యాల, ఏప్రిల్ 28 ( నినాదం):** పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని,విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని అఖిల విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈరోజు జరిగే సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి పాదయాత్ర కార్యక్రమానికి వెళ్తున్నలిఏఐఎస్ఎఫ్ చేర్యాల మండల సహాయ కార్యదర్శి పోతుగంటి ప్రశాంత్ మండల ఉపాధ్యక్షులు గిరిక అభినవ్ ను ముందస్తుగా పోలీస్ లు అక్రమంగా అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు అనేక రకాల వాగ్దానాలు చేశాడని విద్యార్థులకు స్కాలర్షిప్ రియంబర్స్మెంట్లు విడుదల చేసి అదేవిధంగా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం కోసం కృషి చేస్తానని చెప్పి ఇప్పటివరకు కనీసం విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నాడని వారు అన్నారు తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖను ముఖ్యమంత్రి గుప్పెట్లో పెట్టుకొని ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలకు వత్తాసు పలుకుతూ వాటి ఓపెనింగ్ లకు వెళుతున్నాడే తప్ప విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదని ఎద్దేవా చేశారు పెండింగ్లో ఉన్న రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయకుంటే అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాన్ని చవిచూడాల్సి వస్తుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు




**వికారాబాద్, ఏప్రిల్ 27 (నినాదం):** వికారాబాద్ జిల్లా కేంద్రంలో బస్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా మహిళను ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో మహిళ కాలుకు తీవ్రంగా రక్త గాయలైయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం జిల్లా పరిధిలోని భార్వాద్ కు చెందిన మహిళా బాలమ్మ రోడ్డు దాటుతుండగా ఈ ఘటన జరిగిందని తెలిపారు. ప్రక్కనే పెట్రోల్ బంకు ఉన్నదని పెట్రోల్ కొరత కారణంగా రోడ్డుపై వాహనాలు నిలిపి ఉండటంతో గందరగోళ పరిస్థితి నెలకొన్న తరుణంలో మహిళను బస్సు ఢీ కొనడంతో ఆమె కాలు నుజ్జు నుజ్జు కావడం జరిగిందని చెప్పారు. వెంటనే అంబులెన్సు ద్వారా ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించినట్లు చెప్పారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని మహిళకు న్యాయం చేయాలని వారు అన్నారు.

### వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా..

# కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి





### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 28 ( నినాదం):** వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతానికి నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్, విద్యుత్, తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, శానిటేషన్, సాదా బైనామాలు, భూభారతి దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై వివరంగా చర్చించారు. మండలాల వారీగా గ్రామాల్లో నీటి సరఫరా పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, మరమ్మతులు అవసరమైన పనులపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత వేసవిలో సమస్యలు ఎదురైన ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధి స్పష్టంగా తెలిసేలా ప్రతి గ్రామ పంచాయతీకి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని, బిల్లులు ఆలస్యం లేకుండా వెంటవెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. సాదా బైనామాలు, భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించి లో వోల్టేజ్, ట్రాన్స్ఫార్మర్లు, లైన్ల మరమ్మత్తులు వంటి సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గండిమైసమ్మ దేవాలయంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

### ఎస్‌హెచ్‌ఓ హరికృష్ణ రెడ్డి

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 28(నినాదం):** గండిపేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిమైసమ్మ దేవాలయంలో భక్తుల భద్రతను పెంపొందించడం నేరాల నివారణే లక్ష్యంగా నర్సింగి పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. మంగళవారం నాడు నర్సింగి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జి. హరి కృష్ణ రెడ్డి , సెక్టార్ ఎస్ఐ శ్రీరామ్ గోపి తో కలిసి ఆలయాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఆలయ పరిసరాలను పరిశీలించిన అనంతరం, ఎస్‌హెచ్‌ఓ దేవాదాయ శాఖ ఈవో మాణిక్ ప్రభు తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రతకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. దేవాలయ పరిసరాల్లోని అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో అత్యాధునిక సీసీ కెమెరాలను తక్షణమే ఏర్పాటు చేయాలి. భక్తుల రక్షణ కోసం అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయం లోపల, వెలుపల తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలి. దేవాలయ ఆస్తుల రక్షణ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం భద్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో అవసరమైన మార్పులను తక్షణమే చేపట్టాలని దేవాదాయ శాఖ అధికారిని ఎస్‌హెచ్‌ఓ సూచించారు.



## వ్యాపార నిర్ణయంలో ఏఐఅండ్ఎంఎల్ వినియోగంపై కార్యశాల

**పటాన్చెరు, ఏప్రిల్ 28(నినాదం):** గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ లో 'వ్యాపార నిర్ణయం తీసుకోవడం కోసం కృత్రిమ మేధస్సు ఉ యంత్ర అభ్యాసం'పై మే నెల 25 నుంచి 29వ తేదీ వరకు, ఐదు రోజుల ఆన్ లైన్ ఆచారణాత్మక కార్యశాల (యాజమాన్య వికాస కార్యక్రమం -- ఎండీపీ)ను నిర్వహిస్తున్నట్టు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆధునిక వ్యాపార నిర్ణయం తీసుకోవడంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) యొక్క పెరుగుతున్న ప్రాధాన్యాన్ని సదస్యులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమ లక్షమని తెలిపారు. ఏఐ-ఆధారిత విశ్లేషణలు వినియోగదారులను ఆకట్టుకోవడం, డిమాండ్ అంచనా, నష్ట అంచనా, ఆయా సంస్థలకు అనుగుణంగా మార్కెటింగ్ వంటి రంగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్నందున, డేటా-ఆధారిత నిర్ణయాల కోసం ఈ సాంకేతికతలను వినియోగించడానికి ఆచరణాత్మక అంతర్దృష్టులతో ఈ శిక్షణలో పాల్గొనేవారిని సన్నద్ధం చేయడానికి ప్రయత్నిస్తామని వివరించారు. ప్రధానంగా నిర్వహణ, వాణిజ్యం, ఆర్థిక శాస్త్రం, కంప్యూటర్ అప్లికేషన్లు, ఇంజనీరింగ్ విభాగాల నుంచి అధ్యాపకుల కోసం రూపొందించినట్టు తెలియజేశారు. ఎంఎల్ ను పూర్తిగా సాంకేతిక అంశంగా పరిగణించడం కంటే వ్యాపార-ఆధారిత వినియోగ కేసులు, ఆచరణాత్మక ప్రదర్శనలు, నమూనా ఉత్పత్తి వివరణపై కార్యశాల దృష్టి పెడుతుందన్నారు. ఇందులో పాల్గొనేవారికి ఏఐ, ఎంఎల్ భావనలను అందుబాటులో ఉంచడానికి ఆచరణాత్మక డేటాసెట్లు, విజువలైజేషన్ ఆధారిత వివరణలు, ఉపయోగించడానికి సులభమైన విశ్లేషణ అంతర్ముఖంగా ఉపయోగిస్తామని తెలిపారు. బిజినెస్ అనలిటిక్స్, డేటాసైన్స్, ఏఐ-ఎంఎల్ అప్లికేషన్లలో విస్తృత అనుభవం ఉన్న విద్యావేత్త, పరిశోధకుడు డాక్టర్ ఎం.కామాక్షయ్య ప్రధాన శిక్షకుడిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పర్యవేక్షించిన,



పర్యవేక్షించని అభ్యాసం, సిఫారసుదారు వ్యవస్థలు, సమిష్టి నమూనాలు వంటి కీలక అంశాలను వివరిస్తుందని తెలిపారు. ప్రతి సాంకేతికతను వినియోగదారుల అంచనా, మార్కెట్ విభజన, ఉత్పత్తి సిఫార్సు, మోసం గుర్తింపుతో సహా వాస్తవ-ప్రపంచ నిర్వాహక ప్రశ్నలను అనుసంధానిస్తుందని వివరించారు. ఈ కార్యశాల పూర్తయ్యేసరికి, ఇందులో పాల్గొనేవారు విషయ పరిజ్ఞానంపై అవగాహనతో పాటు ఏఐ-ఎంఎల్ పద్ధతులను ఆచరణాత్మకంగా తెలుసుకుంటారని తెలిపారు. ఈ పద్ధతులను వ్యాపార నిర్ణయ సమస్యలకు వర్తింపజేయడానికి, ఏఐ-ఆధారిత అధ్యయనాలు (కేస్ స్టడీస్), విద్యార్థి ప్రాజెక్టులను రూపొందించడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు, తమ పేర్ల నమోదు, రుసుము, ఇతరత్రా వివరాల కోసం jpaul@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలని లేదా డాక్టర్ జోసెఫ్ పాల్ ను సంప్రదించాలని సూచించారు.

### మానసిక ప్రశాంతతకు..

# యోగా ఒక్కటే సరైన మార్గం





### • మదర్‌థెరిసా కాలనీలో అవగాహన సదస్సు

**జవహర్ నగర్, ఏప్రిల్ 28 ( నినాదం):** నేటి యాంత్రిక జీవనంలో మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఒక్కటే సరైన మార్గమని, యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సేవా పరమో ధర్మ ఫౌండేషన్ ప్రతినిధులు, రాజులాల్ ఆర్గనైజింగ్, విజయ్ గైక్వాడ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మదర్ తెరిసా కాలనీలో కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సేవా పరమో ధర్మ ఫౌండేషన్ యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా నిపుణులు కాలనీ వాసులకు పలు ఆసనాలు, ప్రాణాయామం గురించి వివరించారు. నిత్యం యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, రోగనిరోధక శక్తి పెరుగుతుందని నిర్వాహకులు వివరించారు. అవగాహన సదస్సు అనంతరం ఫౌండేషన్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. కాలనీలోని పేదలకు, చిన్నారులకు పండ్లు దుస్తులు పంపిణీ చేశారు. సామాజిక సేవే లక్ష్యంగా తమ ఫౌండేషన్ పనిచేస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య సేవా కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, పంతై, శ్రామనేరులు, సుధాకర్, అజయ్, అనసూయ, సోనీ జాదవ్,ఇంతేష్,రేఖ స్థానికులు పాల్గొన్నారు.

# జనగణన సన్నాహాలు అంతర్గాంలో శిక్షణ ప్రారంభం

**ఏన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ప్రాక్టికల్ శిక్షణ**
**తూము రవీందర్ పటేల్ అంతర్గత తాసిల్దార్**

**రామగుండం ప్రతినిధి ఏప్రిల్ 28 (నినాదం):** పెద్దపల్లి జిల్లా, అంతర్గాం దేశ అభివృద్ధి దిశను నిర్ణయించే అత్యంత కీలక ప్రక్రియ అయిన జనగణనకు అంతర్గాం మండలంలో సన్నాహాలు వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో శిక్షణ శిబిరం రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లాకు చెందిన మాస్టర్ ట్రైనర్లు, జనగణన నిర్వహణపై పూర్తి



స్థాయి అవగాహన కల్పిస్తున్నారు. మూడు రోజుల శిక్షణ– ప్రాక్టికల్ ఢ ఆన్‌లైన్ విధానాలు మూడు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణలో, ఇంటింటి సర్వే విధానం డేటా సేకరణలో జాగ్రత్తలు ఆన్‌లైన్ నమోదు విధానాలు ప్రాక్టికల్‌గా వివరించబడుతున్నాయి.

**జనగణన దేశ ప్రగతికి అద్దం - తహాశీల్దార్**

ఈ సందర్భంగా తహాశీల్దార్ ఢ ఛార్జ్ సెన్సస్ ఆఫీసర్ తూము రవీందర్ పటేల్ మాట్లాడుతూ.. జనగణన అనేది పరిపాలనకు మూలస్తంభమని, దేశ అభివృద్ధి ప్రణాళికలకు ఇది దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. కోవిడ్‌తో వాయిదా - ఈ ఏడాది అమలు 2021లో జరగాల్సిన జనగణన కోవిడ్ కారణంగా వాయిదా పడిందని, ఈ సంవత్సరం కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు దాన్ని పునఃప్రారంభించాయని వెల్లడించారు. మండలంలో 50కి పైగా అధికారులు రంగంలోకి అంతర్గాం మండలంలోనే 50 మందికి పైగా అధికారులు ఈ ప్రక్రియలో పాల్గొని, ప్రతి ఇంటి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.

# మే 6న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహణ

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.. 57 సంస్థలతో 1799 ఉద్యోగ అవకాశాలు లభ్యం**



**పెద్దపల్లి రూరల్,ఏప్రిల్-28 (నినాదం) :** పెద్దపల్లి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు జిల్లా పరిపాలన యంత్రాంగం, డస్క్,డిట్ సంయుక్తంగా మే 6న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ డ్రైవ్‌లో మొత్తం 57 సంస్థలు పాల్గొంటుండగా, సుమారు 1799 ఉద్యోగ అవకాశాలు లభ్యమవుతున్నాయని తెలిపారు. టెలికాం ఢ కమ్యూనికేషన్, కస్టమర్ సపోర్ట్ ఢ బి.పి.ఓ,సేల్స్ ఢ మార్కెటింగ్, డిజిటల్ సర్వీసెస్,ఫీల్డ్ ఆపరేషన్స్ వంటి విభిన్న రంగాల్లో ఈ అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని యువతను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయడం,వారికి నేరుగా ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు.టస్క్, డిట్ ద్వారా ఇప్పటికే శిక్షణ పొందిన పలువురు యువత ఈ తరహా జాబ్ డ్రైవ్‌ల ద్వారా ఉద్యోగాలు సాధించి మంచి స్థాయికి చేరుకున్న విషయం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో పదవ తరగతి,ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా,డిగ్రీ, ఫార్మసీ, ఇంజనీరింగ్, ఎం.బీ.ఏ,తదితర అర్హత కలిగిన ప్రతి యువకుడు,యువతి ఈ మెగా జాబ్ డ్రైవ్‌ను ఒక మంచి అవకాశంగా తీసుకుని తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లతో హాజరుకావడంతో పాటు,డిట్ పోర్టల్‌లో నమోదు చేసుకుని అప్లై చేయాలని సూచించారు.జిల్లా యువత ఉపాధి పొందడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా, జిల్లా సమగ్ర అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు.ఈ దిశగా జిల్లా పరిపాలన యంత్రాంగం పూర్తి మద్దతు అందిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# పెళ్లిరోజు సందర్భంగా అన్నదానం



**మంచిర్యాల, ఏప్రిల్ 28(నినాదం):** మంచిర్యాల శాసన సభ్యులు ప్రేమ్ సాగర్ రావు దంపతుల 40వ వివాహ వార్షికోత్సవం వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు,14వ డివిజన్ కార్పొరేటర్ తూముల నరేష్ గార్ల ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భగవంతుల ఆశీస్సులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, రానున్న రోజుల్లో మరిఎన్నో పదవులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఇలాంటి మరిఎన్నో పెళ్లి రోజులు చేసుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దంపతులకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ఫైర్ ఆఫీసర్ భీమయ్య**

**కాగజ్ నగర్ ఏప్రిల్ 28(నినాదం) :** వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉన్నందున, హోటళ్లు రెస్టారెంట్ల యజమానులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కాగజ్ నగర్ ఫైర్ ఆఫీసర్ భీమయ్య సూచించారు మంగళవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు హోటళ్లు మరియు రెస్టారెంట్లలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ భీమయ్య మాట్లాడుతూ, వేసవిలో చిన్నపాటి అజాగ్రత్త కూడా పెను ప్రమాదానికి దారితీస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా వంట గదులలో గ్యాస్ లీకేజీలు కాకుండా చూసుకోవాలని, ఎలక్ట్రికల్ వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో సిబ్బందికి వివరించిన ప్రతి హోటల్‌లో తప్పనిసరిగా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ అందుబాటులో ఉంచుకోవాలి మరియు వాటిని ఉపయోగించే విధానంపై సిబ్బందికి అవగాహన ఉండాలి అన్నారు ప్రమాదం జరిగిన



పుడు వినియోగదారులు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు ఎగ్జిట్ పాయింట్లు ఖాళీగా ఉండాలి మంటలు చెలరేగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని ప్రాథమికంగా మంటలను ఆర్పేందుకు అందుబాటులో ఉన్న వనరులను వాడాలని తెలిపారు. ప్రజా భద్రతే ధ్యేయంగా అగ్నిమాపక శాఖ ఈ తనిఖీలు మరియు అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫైర్ మాన్ ఇమ్రాన్ మధుకర్ అగ్నిమాపక సిబ్బంది మరియు స్థానిక హోటల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ సరఫరాలో ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ ప్రతినిధి, ఏప్రిల్ 28.(నినాదం):** పెట్రోల్, డీజిల్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలుగకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై సంబంధిత అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న పెట్రోల్ బంకుల వివరాలు, రోజువారీగా పెట్రోల్, డీజిల్ అమ్మకాల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు తప్పనిసరిగా వచ్చిన స్టాక్, అమ్మిన స్టాక్, మిగిలిన స్టాక్ వివరాలు డైలీ స్టాక్ రిజిస్టర్ లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఎవరికి కూడా అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ ఇవ్వరాదన్నారు. పెట్రోల్, డీజిల్ అక్రమ రవాణా, నిల్వ చేయకూడదన్నారు. కృత్రిమ కొరత సృష్టించరాదని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద పెట్రోల్, డీజిల్ అక్రమ రవాణా పై ప్రత్యేకంగా ఉంచాలన్నారు. జిల్లా ప్రజల అవసరాలను మేరకు పెట్రోల్, డీజిల్ సరఫరా చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్, ఏఎస్పీ లు అజ్మీరా సంకేత్ కుమార్, సాయి కిరణ్, ఆర్డీవో రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారి రాజేందర్, డీఎంహెచ్ఓ రాజేందర్, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, అంబాజీ, మోహన్ సింగ్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తబితా ఆశ్రమంలో 'చైల్డ్ సేఫ్టీ-డ్రగ్స్‌కు నో చెప్పండి'

**అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీస్ కమిషనర్**




**గోదావరిఖని, ఏప్రిల్ 28 (నినాదం):** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండంలోని తబితా ఆశ్రమంలో "చైల్డ్ సేఫ్టీ – డ్రగ్స్‌కు నో చెప్పండి" అనే అంశంపై రామగుండం సీఐ శ్రీ ప్రవీణ్ కుమార్, ఎస్.ఐ.సంధ్యరాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా , పెద్దపల్లి డీసీపీ శ్రీ బి. రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పిల్లల భద్రతకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను వివరించారు.అలాగే మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక ప్రభావాలు భవిష్యత్ జీవనశైలిపై వాటి దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు.యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి,క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకోవాలని, మంచి అలవాట్లు అలవరచుకుని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలని సూచించారు.అదేవిధంగా విద్యార్థుల శారీరక,మానసిక అభివృద్ధిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఆశ్రమంలోని పిల్లలకు క్రీడా సామగ్రి మరియు స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించి,మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ శ్రీ బి. రామ్ రెడ్డి,రామగుండం సీఐ శ్రీ ప్రవీణ్ కుమార్, రామగుండం ఎస్.ఐ. సంధ్య రాణి, ఎన్టీపీసీ ఎస్.ఐ. ఉదయ్ కిరణ్, పోలీస్ సిబ్బంది, ఆశ్రమం నిర్వాహకులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయడమే మున్సిపల్ లక్ష్యం

**మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్**

**మంథని ఏప్రిల్ 28 (నినాదం) :** మంథని మున్సిపల్ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయడమే మున్సిపల్ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మంథని మున్సిపల్ పరిధిలోని జూనియర్ కళాశాల మైదానాన్ని మున్సిపల్ చైర్మన్ సందర్శించారు. సరదాగా వాకర్స్ తో ముచ్చటించారు. త్వరలోనే మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో వాకర్స్ అసోసియేషన్ సమస్యలను పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. పురుషులకు అనుగుణంగా ఓపెన్ జిమ్ ఏర్పాటుచేసి సౌకర్యాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, ప్రెస్ క్లబ్ కోశాధికారి తగరం రాజు, వ్యవసాయం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి,



తాటి సమ్మయ్య గౌడ్, వోల్లాలా విజయ్ కుమార్, సత్తిరెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, ఎరుకల పోచం, వేణు, రేపాల రమేష్, దొరగోర్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల మెరుపులతో అంగన్వాడి వేదిక కళకళ... ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**56వ డివిజన్ అంగన్వాడి**
**కేంద్రంలో ఉత్సాహభరిత వేడుకలు**
**ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణు**

**గోదావరిఖని, ఏప్రిల్28 (నినాదం):** రామగుండం మున్సిపల్ పరిధిలోని 56వ డివిజన్ అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణు గారు హాజరై చిన్నారులకు ప్రోత్సాహం అందించారు. పిల్లల ప్రతిభకు వేదిక – డాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి అంగన్వాడి చిన్నారులు ప్రదర్శించిన డాన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా పాల్గొనగా, వారిని కార్పొరేటర్ గారు బహుమతులతో సత్కరించారు. అసెస్‌మెంట్ కార్డులు, బహుమతుల అందజేత,చిన్నారుల విద్యా పురోగతిని గుర్తిస్తూ, అసెస్‌మెంట్ కార్డులు మరియు బహుమతులను కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణు గారి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. పిల్లల కృషిని ప్రశంసిస్తూ, వారికి మరింత ఉత్తేజాన్ని కలిగించారు. విద్యకు ప్రభుత్వ ప్రాధాన్యం – ఉన్నత లక్ష్యాల వైపు విద్యార్థులు సాగాలి,ఈ సందర్భంగా కార్పొరేటర్



మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారు విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రతిభావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు ,పాల్గొన్న ప్రజలు – విజయవంతమైన కార్యక్రమం ఈ కార్యక్రమంలో సీడిపిఓ (ఐసిడిఎస్) అధికారులు, అంగన్వాడి టీచర్లు, ఆర్పీలు, ఆయమ్మలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణు గారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశరావు..**
**పిఎసిఎస్ చిన్న కలువల ఆధ్వర్యంలోనిర్వహిస్తున్న**
**కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఏఎంసి చైర్మన్**




**సుల్తానాబాద్, ఏప్రిల్ 28 (నినాదం):** అన్నదాతల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినపాల ప్రకాష్ రావు స్పష్టం చేశారు. మంగళవారం సుల్తానాబాద్ మండలంచి న్నకల్వల ప్రాథమికవ్యవసాయ సహ కార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నారా యణపూర్, కోదురు పాక, దేవునిపల్లి, చిన్నకల్వల, రెబ్బల్లేపల్లి, పెరికపల్లి, మియాపూర్, చిన్న బొంకూ ర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. మ్యాచర్ వచ్చేవరకు కల్లాల వద్ద ఆరబెట్టి సెంటర్ కు ధాన్యాన్ని తరలించాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అంతటి పుష్పలత , సంఘ ఇన్చార్జి మహమ్మద్ ముఫాసిర్ అహ్మద్, అసిస్టెంట్ రిజిస్టర్ వెంకటేశ్వర్లు, మాజీ సింగిల్ విండో చైర్మన్లు దేవరనేని మోహన్ రావు, శ్రీగిరి శ్రీనివాస్, సీఈవో వల్లకొండ రమేష్, ఆయా గ్రా మాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, నాయకులు, రై తులు, హమాలీలు, సంఘ సభ్యులు , సంఘ సిబ్బంది, సెంటర్ ఇన్చార్జులు, ట్యాబ్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



**నిర్మల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 (నినాదం):** దిలావర్పూర్ మండలం లోని ప్రసిద్ధ దేవాలయం కాల్వ లక్ష్మినరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు నేడు ప్రారంభమై, 30 వ తేదీ గురువారంలలో జరగబోయే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆహ్వానపత్రికను మాజీ డీసీసీ అధ్యక్షులు, నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కుచాడి శ్రీహరి రావ్ గారికి ఆలయ ధర్మకర్తల మండలి అందజేయడం జరిగింది. కాల్వ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంగూర్ మహేందర్, ధర్మకర్తలు పుదరి శివ ఇతర ధర్మకర్తలు పాల్గొన్నారు.

# పరీక్షల్లో అనుత్తీర్ణులు ఆయన విద్యార్థులు నిరాశ చెందకూడదు

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 (నినాదం):** ఇంటర్మీడియట్ పరీక్షల్లో అనుత్తీర్ణులు అయిన విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిరాశ చెందకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం సోఫీనగర్ కేజీబీవీలో ఇంటర్ పరీక్షల్లో అనుత్తీర్ణులు అయిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆయన, పరీక్షల్లో ఫెయిల్ కావడం జీవితంలో అంతిమం కాదని, భయాన్ని విడనాడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులంతా ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి, సమాజంలో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. పలు సబ్జెక్టులకు సంబంధించిన మెలుకువలను విద్యార్థులకు వివరించిన కలెక్టర్, ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఆచరణాత్మక



బోధన అందిస్తే విద్యార్థుల్లో విషయ అవగాహన మరింత పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, మండల విద్యాధికారి సిద్ధి పద్మ, కేజీబివి ప్రత్యేక అధికారి సుజాత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

**రైతు సమస్యలపై రాజీపడే ప్రసక్తి లేదు...**
**కొనుగోలు జరిపిన వెంటనే ఖాతాలోకి డబ్బులు జమ...**
**ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**





**సుల్తానాబాద్, ఏప్రిల్ 28(నినాదం):** రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొను గోలు చేస్తుందని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హామీ ఇచ్చా రు.మంగళవారం సుల్తానాబాద్ మండలం కాట్న పల్లి గ్రామంలో సుల్తానాబాద్ సింగిల్ విండో ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్,ఆనంద రావు, స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించినారు.అనంతరం మాట్లాడుతూ,రైతు సమ స్యల విషయంలో తాను ఏనాడు రాజీ పడేది లేద ని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్క రైతు కూడా తనను రైతుబిడ్డగా చూడటం సంతోషంగా ఉందన్నారు. రైతులవిశ్వాసంపూర్తిగా చూరగొనడం త న అదృష్టమన్నారు. అయితే రైతు సమస్యలను పరిష్కరించడంలో తన కష్టాన్ని కూడా గుర్తించా లని ఆయనప్రజలను కోరారు.కొనుగోళ్ల విషయం లో రైస్ మిల్లర్ నుండి ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే సెంటర్లలో కొనుగోలు పూర్తయిన వెంటనే ఒకటి రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు.రైతులు తరచూ వ రి పంట కాకుండా పంటల మార్పిడి పై శ్రద్ధ చూపా లని కోరారు. సేంద్రియ ఎరువులను వాడితే భూ సారం పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమం లో సీఈవో సంతోష్, సిబ్బంది ఆరేపల్లి రవి పాటు కాం గ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


**కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు....**

సుల్తానాబాద్ పిఎసిఎస్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గట్టేపల్లి, నీరుకుల్ల, కోమండ్లపల్లి కదంబ పూర్, కందు నూరిపల్లె తది తర గ్రామాలలో స్థానిక సర్పంచులు, నాయకులతో కలిసి మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, పాలకమండలి సభ్యులు,కాంగ్రెస్ శ్రేణులు పన్నాల రాములు, రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బంధువుభూమికి విలువ కోసమే బైపాస్ రోడ్

**జీఓ వచ్చి రెండేళ్లయినా భూసేకరణకు డబ్బులు రాలే**
**రోడ్డున పడనున్న 137 బలహీనవర్గాల కుటుంబాలు**
**రోడ్డు నిర్మాణం పై మంథని ఎమ్మెల్యే పునరాలోచన చేయాలే**
**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని ఏప్రిల్ 28 (నినాదం) :** మంథని ఎమ్మెల్యేకు దగ్గరి బంధువు భూములకు విలువ రావాలని, రియల్ ఎస్టేట్ చేసుకునేందుకే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బైపాస్ రోడ్డుకు శ్రీకారం చుట్టారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పేర్కొన్నారు. మంగళవారం మంథని పట్టణంలోని అంగులూరు శివారులో శ్రీపాద బైపాస్ రోడ్డు నిర్మాణ జరిగే ప్రాంతం, పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణంతో మంథని ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని, ఇది వృధా అని పలుమార్లు ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. బైపాస్ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రెండేళ్ల



క్రితమే జీఓ వచ్చిందని, ఇప్పటి వరకు భూసేకరణకు డబ్బులు రాలేదని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంలో 80ఎకరాలు, 137మంది రైతు కుటుంబాలు రోడ్డున పడనున్నాయని తెలిపారు. ఎమ్మెల్యేకు ఓట్లు వేసింది కాపులు ఇతర సామాజిక వర్గాలేనని, ఇక్కడ కాపులకు భూములు ఉండవద్దనే ఆలోచనతోనే రోడ్డుకు ప్రతిపాదన చేసినట్లు కన్పిస్తోందన్నారు. అయితే ఇక్కడ సింహభాగం రైతులంతా బలహీన వర్గాలకు చెందిన వారేనని ఆయన వివరించారు. ఇప్పటి వరకు భూసేకరణకు డబ్బులు రాకున్నా, రోడ్డు ఈ ప్రాంత ప్రజలకు అవసరం లేకున్నా కేవలం ఎమ్మెల్యే బంధువు కోసమే రోడ్డు వేస్తున్నట్లు అర్థం అవుతోందని, ఇప్పటికైనా ఎమ్మెల్యే పునరాలోచన చేసి ఈ రోడ్డునిర్మాణాన్ని ఆపివేయాలని కోరారు. మంథని ఎమ్మెల్యేకు ఈ మట్టితో సంబంధంలేదని, ఇక్కడ పుట్టలేదని, పెరుగలేదని, ఇంకా ఇక్కడ వ్యవసాయంకూడా లేకపోవడంతో రైతుల బాధలు తెలియవన్నారు. తాను ఇక్కటి మట్టిలో పుట్టి పెరిగామని, ప్రజలతో కలిసి బతుకుతున్నం కనుకనే ఆలోచన చేయమంటున్నామని అన్నారు. బంధువుతో పాటు కాంగ్రెస్ పార్టీ వాళ్ల కోసం ఇది ఆలస్యం చేస్తున్నారని, ఇందులో ల్యాండ్ మాఫియా కూడా ఉందని ఆయన ఆరోపించారు.అందులో వాస్తవాలు, అవాస్తవాలను బేరీజు వేసుకుని వాస్తవాలు ఉంటే గమనించాలని ఆయన హితవు పలికారు. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం చేస్తే ఈ ప్రాంతానికి నష్టమే జరుగుతుందని, కరకట్టలతో నీళ్లు ఆగి పంటలు మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. నిర్మాణాన్ని తక్షణమే ఆపేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే బోయిన్‌పేట, గొల్లగూడెం మీదుగా రింగ్‌రోడ్డు నిర్మిస్తే ఈ ప్రాంతం కొంత మేర అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ప్రజలకు ఉపయోగపడే రీతిలో పనులు చేయాలని, తక్షణమే బైపాస్ రోడ్డు నిర్మాణంపై పునరాలోచన చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**చిన్న పిల్లల హక్కుల భంగన సమస్య వస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలి**

**విద్యా నాణ్యత పెంపుతో పాటు పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి**

**సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్**





**పెద్దపల్లి రూరల్,ఏప్రిల్-28(నినాదం):** బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,బాలల సంరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సల్యయ్, అంగన్వాడీ సేవలు,ప్రీ-ప్రైమరీ విద్య, బాలల సదనాల ద్వారా పిల్లల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి బాలుడికి నాణ్యమైన విద్య, సముచిత పోషకాహారం,సురక్షిత వాతావరణం పొందే హక్కు ఉందని స్పష్టం చేశారు.ఏ చిన్నారికి అయినా సమస్యలు ఎదురైతే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.పెద్దపల్లి జిల్లాలో విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు నాణ్యత పెంపుపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల చదివే సామర్థ్యం ఓ.ఆర్.ఎఫ్,పఠన అవగాహన ఆర్.సి, వంటి సూచికల్లో గణనీయమైన మెరుగుదల నమోదైందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు సమతుల్య పోషకాహారం అందిస్తూ, వారి ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఆర్.బీ.ఎస్.కే కార్యక్రమం ద్వారా పిల్లలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ,ఏ ఆరోగ్య సమస్య ఉన్నా తక్షణ చికిత్స అందిస్తున్నామని, అవసరమైతే శస్త్రచికిత్సలను కూడా ఉచితంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం బాల్యవివాహాల రహిత గ్రామంగా ఎంపికైన పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ కు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్‌ను అందజేశారు. బాల్యవివాహాల నిర్మూలనలో గ్రామ ప్రజలు చూపిన చైతన్యం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్ రావు,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని,అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ మధుసూదన్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం

**రూ.5 లక్షలు తక్షణ ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందజేత**

**జర్నలిజం రంగానికి తీరని లోటు : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**





**మిర్యాలగూడ, ఏప్రిల్ 28 (నినాదం):** ఉప ముఖ్యమంత్రి సీపీఆర్ఓ, సీనియర్ జర్నలిస్ట్ మారబోయిన మధుసూదన్ అకాల మరణం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మంగళవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అశోక్ నగర్‌లో గల మధుసూదన్ నివాసానికి చేరుకున్న మంత్రి మధుసూదన్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.మధుసూదన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిని ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని తక్షణ సాయంగా కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం పరంగా మధుసూదన్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన హామీఇచ్చారు. అదేవిధంగా మధుసూదన్ మృతదేహానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ లుశంకర్ నాయక్, సత్యం, డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస నేత, మాజీలు ఎమ్మెల్యే న లమోతు భాస్కరరావు, చిరుమర్రి లింగయ్య, తిప్పన విజయసింహారెడ్డి, తదితరులు మధుసూదన్‌కు నివాళులు అర్పించారు. మధుసూదన్ ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన జర్నలిస్ట్ అని, మధుసూదన్ సేవలను మంత్రి కొనియాడారు. ఆయన మరణం జర్నలిజం రంగానికి, వ్యక్తిగతంగా తమకు తీరని లోటని ఆవేదన వ్యక్తంచేశారు.మధుసూదన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## ఉచిత వేసవి క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**మంచిర్యాల, ఏప్రిల్ 28 (నినాదం):** క్రీడలతోనే మానసిక , శారీరక ఉల్లాసం అని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత క్రీడా శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు సద్వినియోగ పరుచు కోవాలన్నారు. సింగరేణి సంస్థ ప్రతీ యేట నిర్వహించే ఉచిత క్రీడా శిక్షణా కార్యక్రమాల్లో భాగం గా శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఉద్యోగుల పిల్లలకోసం ఈ సారి ఐదు విభాగాల్లో వేసవి ఉచిత క్రీడా శిక్షణా తరగతులు నిర్వహిస్తు న్నారు. 25 రోజులు కొనసాగే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సింగరేణి సంస్థ ఖర్చుకు వెనుకాడకుండా కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని ఉద్యోగులు పిల్లలు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. సింగరేణి కల్పిస్తున్న ఎన్నో సంక్షేమ కార్యక్రమాల్లో క్రీడాకారుల ప్రోత్సాహం ఒకటి అన్నారు. ప్రస్తుతం చిన్నపిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారి ఆటపాటలు, క్రీడలు , ఔట్ డోర్ గేమ్స్ను పూర్తిగా మరిచారు... ఈ వేసవి సెలవుల్లో పిల్లలను ఫోన్లకు దూరంగా ఉంచడంలో ఈ శిక్షణా శిబిరాలు ఎంతగానో మేలు చేస్తాయి అన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులు భవిష్యత్లో ఆయా క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం . సత్యనారాయణ, గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు , డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్,ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు

**అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం**



**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 28 (నినాదం) :** జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కొత్తకోట తహసిల్దార్ కార్యాలయం నుంచి జిల్లాలో ఇంధన లభ్యతపై తహసిల్దార్లతో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వెబ్ఎక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం తోపాటు అన్ని మండలాల తహసీల్దార్లు, ఇంధన అవుట్ లెట్ డీలర్లు, ఎస్ ఓ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అవసరాలు, రవాణా, అత్యవసర సేవలకు ఇంధన కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అలాగే పెట్రోల్ బంకుల వద్ద తగినంత నిల్వలు ఉండేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలని, రోజువారీ విక్రయాలు, నిల్వలపై సమగ్రంగా పరిశీలించాలని చెప్పారు. ఎలాంటి కృత్రిమ కొరత సృష్టించే చర్యలను తీవ్రంగా పరిగణించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.పొరుగు రాష్ట్రాల నుంచి అనవసరంగా వాహనాలు వచ్చి ఇంధనాన్ని వినియోగించకుండా చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని సూచించారు. అదేవిధంగా ప్రజల్లో అపోహలు తొలగించే విధంగా మీడియా ద్వారా సరైన సమాచారాన్ని అందించాలని పేర్కొన్నారు.జిల్లాలో ఇంధన సరఫరా సజావుగా కొనసాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్.ఐ.ఆర్‌పై సమీక్షించిన కలెక్టర్




**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 28, (నినాదం):** కేంద్ర ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా సమగ్రమైన, పారదర్శక మైన ఓటరు జాబితాలను రూపొందించ డానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్. ఐ.ఆర్) ప్రక్రియ కు శ్రీకారం చుట్టిందనీ, జిల్లాలో ఈ ప్రక్రియను మూడు రోజుల్లో వేగం చేసి 85 శాతం మ్యాపింగ్ చేయా లని జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక ఆదేశించారు. మంగళ వారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను తో కలిసి కలెక్టర్ ఎస్.ఐ.ఆర్, సాదా బైనామా పై తహసీల్దార్లు, డీటిలు, సూపర్ వైజర్లు, ఏ ఈ ఆర్ వో లతో సమీక్ష జరిపారు. ఎస్. ఐ ఆర్ ప్రక్రియను చాలా పారదర్శకంగా చేయాలన్నారు. జిల్లాలోని ప్రతీ పోలింగ్ కేంద్రంలో 85 శాతం పూర్తి చేయాలని ఆమె తేల్చి చెప్పారు. లేని పక్షంలో సంబంధిత అధికారులు, ఉద్యోగులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అనంతరం సాదా బైనామా, భూ భారతి దరఖాస్తుల పై తహసిల్దార్ల తో చర్చించారు. జీవో 74, 76 ప్రకారం సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 2075 సాదా బైనామా దరఖాస్తులు ఉన్నాయని, 2674 సర్వే నంబర్లను విచారణ చేసి ఈ నెలాఖరు నాటికి ఆయా దరఖాస్తులను అనుమతించాలని, లేదా తిరస్కరించాలని, ఆయా దరఖాస్తులను అనుమతించిన, తిరస్కరించిన కారణాలను స్పష్టంగా పేర్కొనాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తహసిల్దార్ల కు సూచించారు. చివరగా భూ భారతి పెండింగ్ దరఖాస్తులపై చర్చించి వాటిని క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

N NADAM CINEMA




## లుక్ టెస్ట్ పూర్తయ్యింది

**చిరు -బాబీ కాంబినేషన్‌లో మూవీ**

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతోన్న ఆయన తాజాగా కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన లుక్ టెస్ట్‌ను పూర్తి చేశారు. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా రెండో సినిమా రానున్న విషయం తెలిసిందే. మెగా 158గా ఇది ప్రచారంలో ఉంది. ఈ సినిమా అప్‌డేట్‌ను దర్శకుడు పంచుకున్నారు. ఈ రోజు లుక్‌టెస్ట్ పూర్తయిందని..త్వరలోనే షూటింగ్ ప్రారంభించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చిరు ఫొటోషూట్‌కు సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ 'హింసకు ముందు నిశ్శబ్దం' అనే క్యాప్షన్ రాశారు. దీంతో భారీ స్థాయి యాక్షన్ చిత్రంగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి – బాబీ కాంబినేషన్‌లో గతంలో 'వాల్తేరు వీరయ్య' రూపొందింది. 2023లో వచ్చిన ఈ చిత్రం మంచి ఆదరణను సొంతం చేసుకోవడంతో వీరి రెండో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఈ ఏడాది 'మన శంకర వరప్రసాద్ గారు'తో హిట్ అందుకున్న చిరంజీవి మూడు సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'విశ్వంభర' ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌తో పాటు శ్రీకాంత్ ఓదెల చిత్రం లైనప్‌లో ఉంది.

## వరుస సినిమాలతో బాలయ్య బిజీ

**కొరటాల శివతో తదుపరి మూవీ అంటూ ప్రచారం**




నందమూరి బాలకృష్ణ మాత్రం తన రూటే సెపరేటు అంటూ పయనిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 66 సంవత్సరాలు. అయినా ఓ వైపు నటునిగా బిజీగా ఉన్నారు. మరోవైపు హిందూపురం ఎమ్మెల్యేగా తన నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. అలాగే తన తల్లి పేరిట నెలకొన్న బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంత బిజీగా ఉన్నా ఈ సారి సినిమాల సంఖ్య పెంచాలని యోచిస్తున్నారు బాలయ్య. అందుకు తగ్గట్టుగానే పలువురు దర్శకులు, నిర్మాతలు ఆయనతో సినిమాలు తీయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓ సినిమా అయిన తరువాత మరో చిత్రాన్ని లైన్ లో పెడతారు ఎవరైనా. అయితే బాలయ్య ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్ టైనర్ చేస్తున్నారు.ఆ సినిమా ఓ వైపు షూటింగ్ జరుపుకుంటూ ఉండగానే మరో చిత్రాన్ని లైన్ లో పెట్టనున్నారట బాలయ్య. ఈ మధ్యే బాలకృష్ణకు డైరెక్టర్ కొరటాల శివ ఓ సబ్జెక్ట్ వినిపించారు. ఆ సబ్జెక్ట్ బాలయ్యకు ఎంతగానో నచ్చిందని, త్వరలోనే షూటింగ్ మొదలు కానుందనీ సమాచారం. ప్రస్తుతం బాలయ్య హీరోగా గోపీచంద్ మలినేని రూపొందించే చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేసే ప్రయత్నంలో ఉన్నారు. వెంకట సతీశ్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.. ఇక బాలయ్యతో కొరటాల శివ రూపొందించే చిత్రానికి సాహు గారపాటి, మిక్కిలినేని సుధాకర్ నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. సమాంతరంగా ఈ రెండు చిత్రాల షూటింగ్ జరపనున్నారు. వేసవి పూర్తి కాగానే ఈ రెండు చిత్రాల కోసం డేట్స్ కేటాయించారు బాలకృష్ణ. రెండు సినిమాల్లో ఒకటి సంక్రాంతికి వస్తే, మరోటి ఎప్పుడు వస్తుందనే అనుమానం కలుగక మానదు. రెండు సినిమాలు వచ్చే సంవత్సరమే వెలుగు చూస్తాయని వినిపిస్తోంది. అయితే ఈ యేడాది బాలయ్య సినిమా లేనట్టేనా అని అభిమానులు నిరాశ చెందుతున్నారు. నిజానికి బాలయ్య–గోపీచంద్ మలినేని చిత్రాన్ని ఈ యేడాదే దసరా కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కథలో మార్పులు జరగడం, క్యాస్టింగ్ లోనూ ఛేంజెస్ చోటు చేసుకోవడంతో బాలయ్య–గోపీచంద్ మలినేని మూవీ సంక్రాంతికి షిఫ్ట్ అయింది. మరి బాలయ్య – కొరటాల శివ మూవీ ఎప్పుడు ఎలా ప్రేక్షకులను పలకరిస్తుందో చూడాలి.

## మైఖేల్ మూవీ వసూళ్ల సునామీ



దివంగత పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక బయోపిక్ 'మైఖేల్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన అతి తక్కువ కాలంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డులను తిరగరాస్తూ అంతర్జాతీయ స్థాయిలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.2000 కోట్లు మిలియన్ల మార్కుకు చేరువలో ఉండగా, భారత మార్కెట్‌లోనూ మైఖేల్ జాక్సన్‌కు ఉన్న తిరుగులేని క్రేజ్‌ను చాటుతూ రూ.20 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. కింగ్ ఆఫ్ పాప్ మ్యూజిక్, ఐకానిక్ డ్యాన్స్ మూమెంట్స్ మరియు ఆయన జీవితంలోని లోతైన సంఘర్షణలను దర్శకుడు ఆంటోనీ ఫుక్వా వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంతో అంతర్జాతీయ ప్రేక్షకులతో పాటు భారతీయ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ పాత్రలో ఒదిగిపోయిన తీరుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్ మరియు డ్యాన్స్ విన్యాసాలు చూస్తుంటే సాక్షాత్తు మైఖేల్ జాక్సనే మళ్లీ తిరిగి వచ్చారా అన్నట్లుగా ఉందని విమర్శకులు సైతం కొనియాడుతున్నారు.



## మా ఇంటి బంగారం ప్రమోషన్స్

**ఇంకా మొదలు పెట్టని నటి సమంత**



ఈ మధ్య కాలంలో ప్రేక్షకులను మెప్పించడం చాలా కష్టంగా మారింది. ఒకప్పుడు స్టార్ హీరో, స్టార్ హీరోయిన్ సినిమా వస్తోంది అంటే చాలు.. అది ఎలా ఉన్నా కూడా ఫ్యాన్స్ హిట్ చేసేవారు. కానీ, ఇప్పటి జనరేషన్ అలా కాదు. ఎంత పెద్ద స్టార్ అయినా సరే కంటెంట్ ఉంటేనే హిట్ చేస్తున్నారు. కంటెంట్ తో పాటు ప్రమోషన్స్ ని కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే ఈ మధ్య స్టార్ హీరోలు సైతం సరికొత్తగా ప్రచారాలు చేస్తూ తమ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత మాత్రం తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్ళలేకపోయారు అని టాక్ నడుస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటిస్తోన్న తాజా చిత్రం మా ఇంటి బంగారం. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని సామ్ భర్త రాజ్ నిడిమోరు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మే 15 న ఈ చిత్రం రిలీజ్ కు సిద్ధమవుతోంది. రిలీజ్ ఇంకా పట్టుమని 15 రోజులు కూడా లేదు.. కానీ, ఇప్పటి వరకు ఈ సినిమా ప్రమోషన్స్ మొదలు పెట్టలేదు. ఒకప్పుడు సామ్ సినిమా రిలీజ్ అంటే ఆ బజ్ వేరే లెవెల్ లో ఉండేది. కానీ, ఇప్పుడు అలా లేదు. రాజ్ నిడిమోరుతో పెళ్ళి తరువాత సామ్ ఒకపక్క నిర్మాతగా.. ఇంకోపక్క హీరోయిన్ గా చేస్తున్న సినిమా మా ఇంటి బంగారం. ఓ బేబీ లాంటి హిట్ తరువాత సామ్– నందినిరెడ్డి కాంబోలోవస్తోన్న చిత్రం కావడంతో ఓ రేంజ్ లో బజ్ ఉంటుంది అనుకున్నారు. అయితే సామ్ మాత్రం ప్రమోషన్స్ చేయడంలో విఫలమయ్యారు అని చెప్పొచ్చు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి ఒక్క ప్రమోషన్ ఇంటర్వ్యూ తప్ప ఇంకేమి రాలేదు.

## పండుగాడి జర్నీకి 20 ఏళ్లు

**పోకిరీ విడుదలై సరిగ్గా రెండు దశాబ్దాలు**




తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించి, బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టించిన 'పోకిరి' చిత్రం సరిగ్గా 20 వసంతాలను పూర్తి చేసుకుంది. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం ఇదే రోజున 2006 ఏప్రిల్ 28న విడుదలైన ఈ సినిమా, అప్పటి వరకు ఉన్న తెలుగు సినిమా బాక్సాఫీస్ లెక్కలను పూర్తిగా మార్చివేసింది. ఈ చిత్రం సూపర్ స్టార్ మహేష్ బాబును మాస్ ప్రేక్షకులకు అత్యంత చేరువ చేయడమే కాకుండా, ఆయనను తిరుగులేని పవర్‌హౌస్‌గా నిలబెట్టింది. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మార్క్ మేకింగ్, పదునైన సంభాషణలు మరియు మహేష్ బాబు అల్ట్రా మోడ్రన్ లుక్ కలిసి వెండితెరపై ఒక మ్యాజిక్ చేశాయి. దాదాపు రూ.12 కోట్ల పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, ఏకంగా రూ.66 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అప్పట్లో 'ఇండస్ట్రీ హిట్'గా రికార్డు సృష్టించింది. కేవలం వసూళ్ల పరంగానే కాకుండా, సాంకేతికంగానూ ఈ చిత్రం సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ముఖ్యంగా మణిశర్మ అందించిన అద్భుతమైన సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రతి థియేటర్లో వైబ్రేషన్స్ పుట్టించాయి. హీరోయిన్ ఇలియానాకు ఈ సినిమా ఓవర్ నైట్ స్టార్‌డమ్ తీసుకురాగా, విలన్‌గా ప్రకాష్ రాజ్ నటన సినిమాకు ప్రాణం పోసింది.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787